ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 10 డిసెంబరు 2025



మన సాగర్‌కి..

69 వసంతాలు

బీడు భూముల్లో బంగారు పంటలు పండిస్తూ.. లక్షల ప్రజలతో పాటు జంతుజాల గొంతు తడుపుతూ.. కృష్ణమ్మ పరవళ్లును కట్టడి చేస్తూ చేపట్టిన నాగార్జున సాగర్ జలాశయ నిర్మాణం బుధవారంతో 69 వసంతాలు పూర్తి చేసుకుంది. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1955 డిసెంబరు 10 న డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

8



కోలాహలంగా.. యువజనోత్సవం

● ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

8



షిర్డీ రెగ్యులర్ వీక్లీ ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు కూత

8

తెలంగాణ టూ ఆంధ్రప్రదేశ్

- బయో ఉత్పత్తుల అక్రమ రవాణా
- నరసరావుపేట కేంద్రంగా అన్ని ప్రాంతాలకు సరఫరా
- రూ. 12.28 లక్షల నిల్వలు పట్టుకున్న విజిలెన్స్

6

చోర్ గ్యాంగ్ లీడర్ తండ్రి ఏఎస్ఐ బదిలీ

- ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి కేసులో కదలిక

8

6 హోరాహోరీగా.. ఎడ్ల పోటీలు

కొనుగోళ్లు కొంతే

బహిరంగ మార్కెట్‌కు తరలిపోతోన్న ధాన్యం

మద్దతు ధరకు ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం.. దళారుల మాటలు నమ్మి అన్న దాతలు మోసపోవద్దు.. అధి కారులు పూర్తిగా సహకరిస్తారు.. రవాణా నుంచి ఎక్కడా ఎలాంటి ఇబ్బంది ఉండదు.. అని మంత్రుల నుంచి కలెక్టర్ వరకు ప్రకటిస్తు న్నారు. కానీ అన్న దాతలకు ఏ స్థాయి లోనూ మద్దతు ఉండటం లేదు.. ధర దక్కడంలేదు. అధికా రుల ఉదాసీనతతో బహిరంగ మార్కెట్‌కే అత్యధికంగా ధాన్యం తరలి పోయిందని సివిల్ సప్లయిస్ లెక్కలు తెలియజేస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు సమీపంలో కూడా ఇప్పటి వరకు మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరగ లేదంటే పరిస్థితి అర్థం చేసు కోవచ్చు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయానికి అన్నదాతలు ఎందుకు ముందుకు రావడం లేదు.. లోటుపాట్లు ఏమిటి అనే విషయంలో అధికారులు ఉదా సీనంగా వ్యవహరిస్తున్నా రు. ధాన్యం సేకరణ అంకంలో కొను గోళ్ల కేంద్రాల ఏర్పాటు చేశారే కానీ బహిరంగ మార్కెట్ అంశం తమదే కాదన్నట్లుగా అధికారులు వ్యవ హరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం బహిరంగ మార్కెట్‌కు తరలినట్లు అంచనాలు ఉన్నాయి.



బాపట్ల: గూడవల్లి సమీపంలోని రహదారిపై ఆరబోసిన ధాన్యం

సాంకేతిక సమస్యలతో జాప్యం..

రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి యాప్ సర్వర్‌కు సాంకేతిక సమస్యతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. స్లాట్ బుకింగ్ సకాలంలో ఓపెన్ కావడంలేదు. దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అవకాశంగా దళారులు ధరను తగ్గించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రూ.1300 మాత్రమే ఇస్తామన్నా గత్యంతరం లేక అటు ఆర్‌ఎస్‌కేల్లో అమ్మకానికి అవకాశం లేక ఇటు నిల్వ చేసుకునే గోదాములు లేక రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తుంది.

రైతు సేవా కేంద్రాల్లో సేకరణలో స్తబ్ధత

- అధికారుల ఉదాసీనతతో తీసికట్టుగా మద్దతు ధర
- మిల్లర్లతో సిబ్బంది లాలూచి.. పట్టించుకోని అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించినా కొనుగోళ్ల విషయంలో వ్యవసాయశాఖ తీరు నత్తే నయమన్నట్టుగా సాగుతోంది. లక్షల టన్నుల్లో ధాన్యం పొలాల్లో నుంచి వస్తుంది. కేవలం కొనుగోలు కేంద్రాలపై దృష్టి కాకుండా బయట కొనుగోళ్లను కూడా రెగ్యులేట్ చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు రచించుకోవాలి. అయితే ఆర్భాటపు ప్రక టనలకే పాలకులు పరిమితమవుతున్నారన్న అభిప్రాయం ఇప్ప టికే రైతుల్లో వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకా రం నిర్వర్తించాల్సిన విధుల్లో కూడా ఆయా విభాగాల ఉదాసీనతే రైతులకు శాపంగా మారు తోంది. ఎక్కడికక్కడ రైతు సేవా కేంద్రాల్లో కేంద్రా లు ఏర్పాటు చేసినా కొనుగోళ్లు అర కొర గానే జరుగుతున్నా అధికారులకు పట్ట డం లేదు. గుంటూ రు, బాపట్ల, పల్నా డు జిల్లాల పరిధిలో ఇప్పటికే దాదాపు లక్ష న్నర టన్నుల ధాన్యం బహి రంగ మార్కెట్‌కు తరలిపో యిందంటే (మిగతా 8వ పేజీలో)



పిడుగురాళ్లలో లారీకి ధాన్యం ఎగుమతి చేస్తున్న కూలీలు

◆ లక్ష్యాలకు దూరం

బాపట్ల జిల్లాలో మొత్తం దిగుబడి 6.80 లక్షల టన్నులు అంచనా కాగా లక్ష్యం రెండు లక్షల టన్నులు. అయితే ఇందులో ఇప్పటి వరకు 21,000 టన్నుల ధాన్యాన్ని మాత్రమే మద్దతు ధరకు సివిల్ సప్లయిస్ విభాగం కొనుగోలు చేసింది. గుంటూరు జిల్లాలో దిగుబడి 4.50 లక్షల టన్నులు కాగా సేకరణ లక్ష్యం 50,000 టన్నులు. పల్నాడు జిల్లాలో దిగుబడి 4.30 లక్షల టన్నులు ఉండగా సేకరణ లక్ష్యం 40 వేల టన్నులు. నిర్దేశించిన లక్ష్యం మేర ఏ జిల్లాలోనూ కొనుగోళ్లు జరగలేదని సివిల్ సప్లయిస్ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

విద్యాశాఖాధికారుల బదిలీ

గుంటూరు, పల్నాడు, బాపట్ల డీఈవోలకు స్థానచలనం



ఎస్ కే సలీం బాషా, గుంటూరు



పీవీజే రామారావు, పల్నాడు



సింగ్ శ్రీనివాస్, బాపట్ల

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి లో అత్యుత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల ప్రణాళికతో సిద్ధమవగా ఎవరూ ఊహించనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. వంద రోజుల ప్రణాళిక అమలులో అధికారులు నిమగ్నమై ఉండగా డీఈవోల బదిలీ ఉపాధ్యాయులను విస్మయానికి గురిచేసింది. కాగా గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక, పల్నాడు డీఈవో ఎల్ చంద్రకళ, బాపట్ల డీఈవో పురుషోత్తంను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు డీఈవోను ప్రకాశం జిల్లాకు, పల్నాడు డీఈవోను కృష్ణా జిల్లాకు బదిలీ చేయగా బాపట్ల డీఈవో పురుషోత్తంకు ఎటువంటి బాధ్యతలు అప్పగించలేదు. కాగా జిల్లా పాఠశాల విద్య ఆఫీసర్(డీఎస్ఈవో) అనే పేరుతో జిల్లాల్లో అధికారుల కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. గుంటూరు డీఎస్ఈవోగా అంబేద్కర్ కోన సీమ జిల్లా డీఈవో ఎస్కే సలీంబాషాను, పల్నాడు డీఎస్ఈవో కృష్ణా జిల్లా డీఎస్ఈవో పీవీజే రామారావు నియమితులయ్యారు. బాపట్ల డీఎస్ఈవోగా పాఠశాల విద్యలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న సింగ్ శ్రీనివాస్‌ను నియమించారు. నూతనంగా నియమతులైన డీఎస్ఈవోలు రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని విద్యా శాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

బదిలీలపై విస్మయం

ప్రభుత్వ ఆదేశాలతో వందరోజుల ప్రణాళిక అమలు కోసం ఇప్పటికే డీఈవోలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో పరిస్థితుల్ని అంచనా వేస్తూ పర్యటనలు చేస్తున్నారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా డీఈవోల బదిలీలు ఏమిటని ఇటు ఉపాధ్యాయులు, అటు ఉపాధ్యాయ సంఘాల నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొత్త డీఎస్ఈవోలుగా నియమితులైన వారు బాధ్యతలు స్వీకరిం చిన తర్వాత పరిస్థితుల్ని అవగాహన చేసుకుని తిరిగి సాధారణ పరిస్థితులు నెలకునేందుకు నెల రోజులకు పైగా సమయం పడుతుందని, ఇది పది పరీక్షలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్పత్తి రంగాలపై దృష్టి సారించాలి

బ్యాంకర్లను ఆదేశించిన కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి రంగాల వైపు దృష్టి సారించాలని, జీవనోపాధుల వృద్ధికి అధిక రుణాలు ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీపై చైర్మన్ హోదాలో కలెక్టర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు మహిళల్లో ఆర్థిక స్వేచ్ఛ సాధించేలా స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ఎదిగే అవకాశాలు బ్యాంకర్లు కల్పించాలన్నారు. సూక్ష్మ, మధ్య చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాలో ప్రాధాన్య రంగాలకు రూ.13,792.66 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.8,315 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15,820 కోట్లు రుణాల లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.10,618 కోట్లతో 67.13 శాతం మాత్రమే లక్ష్యాలు సాధించినట్లు తెలిపారు. రానున్న మూడు నెలల్లో లక్ష్యాల పురోగతి సాధించాలన్నారు. వ్యవసాయరంగానికి రూ.12,080 కోట్లకు రూ.7,416 కోట్లు రుణాలిచ్చామన్నారు. 32,479 పొదుపు సంఘాలు ఉండగా 3,979 సంఘాలకు రూ.604.02 కోట్లు మాత్రమే రుణాలివ్వడంపై కలెక్టర్ ఆరాతీశారు. బ్యాంకర్లు మానవతా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో 8 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని లక్ష్యం కాగా నేటికి 2,254 కార్డులు జారీపై ఆరాతీశారు. కౌలు రైతులకు రూ.100కోట్ల రుణాలివ్వాలని లక్ష్యం నిర్దేశించుకుంటే కేవలం రూ.13.62 కోట్లు విడుదల చేయడం ఏమిటని బ్యాంకర్లను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆర్.బి.ఐ.ఎల్.ఎల్.డివో అభిషేక్, ఎల్‌డీఎమ్ శివకృష్ణ, నాబార్డ్ డీడీఎమ్ రవికుమార్, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ మాధురి, తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ధాన్యం కొనుగోళ్లకు అవార్డులు

ధాన్యం అధికంగా కొనుగోలు చేసిన వారికి అవార్డులతో పాటు ప్రత్యేకంగా సన్మానిస్తామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ధాన్యం కొనుగోలుపై జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరులో ధాన్యం కొనుగోలు అధికంగా జరగనున్నదని చెప్పారు. ఏ రైతు సేవాకేంద్రంలో అధికంగా ధాన్యం కొనుగోలు చేస్తారో సదరు గ్రామవ్యవసాయ సహాయకుడికి, పౌరసరఫరాల ఉప తహసీల్దార్‌లకు, తహసీల్దార్‌లను గణతంత్రదినోత్సవం రోజున సత్కరిస్తారన్నారు.

బంతి బంతికీ బెట్టింగ్

- చీరాల్లో జోరందుకున్న వైనం
- జూదరులకు అడ్డాగా లాడ్జీలు, రిసార్ట్స్


చీరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇండియా - సౌతాఫ్రికా టీ ట్వంటీ మ్యాచ్‌లను కొం దరు వినోదం కోసం వీక్షిస్తుంటే మరి కొందరు సులభంగా డబ్బు సంపాదించేందుకు అవకాశంగా మార్చుకున్నారు. ఈ క్రమంలో చీరాల్లో బంతి బంతికి బెట్టింగ్ జరుగుతోంది. కొందరు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతు న్నారు. గతంలో వన్‌డే మ్యాచ్‌లకు బెట్టింగ్‌లు జరిగేవి. కాగా ప్రస్తుతం ఐపీఎల్, ట్వంటీ ట్వం టీలపైకి జూదరుల దృష్టి మళ్లింది. మ్యాచ్‌లు జరిగే సమయాల్లో చీరాల నియోజకవర్గ పరిధిలో రూ.కోట్లలో బెట్టింగ్‌లు జరుగుతున్నా యని సమాచారం. ఒకప్పుడు చీరాల పట్టణం, పేరాల, వేటపాలెం, జాండ్రపేట, మండల పరిధిలోని ప్రధాన కేంద్రాల్లోనే గతంలో బెట్టింగ్‌లు జరిగేవి. బెట్టింగ్‌లు ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయి. వాట్సాప్, ఇతర యాప్‌లతో గ్రామీణ ప్రాంతాల యువత బెట్టింగ్‌కు చేరువయ్యారు. దీంతో చీరాల పరిధిలోని రిసార్ట్స్, లాడ్జీలు, బార్‌లు, కొన్ని వ్యాపార వాణిజ్య సముదాయాల్లో యువత, విద్యార్థులు, క్రికెట్ వీరాభిమానులు బెట్టింగ్‌లో మునిగి తేలుతున్నారు. ఇదిలా ఉంటే చీరాల పరిధిలో ఇప్పటికే కొందరు వ్యక్తులు అత్యున్నత స్థాయిలో బుకీలుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. కొందరు పాత బుకీలు కూడా యాక్టీవ్ అయినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌లకు పాల్పడే వారు ప్రత్యేకమైన ఫోన్ నెంబర్ వాడుతున్నారు. మ్యాచ్ ప్రారంభమయ్యే అరగంట ముందు మాత్రమే ఆ నెంబర్ వినియోగంలోకి వస్తుంది, మిగిలిన సమయమంతా ఆఫ్‌లోనే ఉంటుంది. ఆన్ చేసిన సమయంలో గతంలో వారి వద్ద ఫీడ్ అయిన నెంబర్‌లకు మాత్రమే ఆన్సర్ చేస్తారు. కొత్త నెంబర్‌లకు రెస్పాండ్ కాకపోవడం విశేషం.

అవగాహన కల్పిస్తున్నాం


ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అలాగే కొన్ని ప్రదేశాలపై నిఘా ఉంచాము. యువత ఇటువంటి వాటికి దూరంగా ఉండటం మంచిది. - ఎండీ మొయిన్, చీరాల డీఎస్పీ

కరకట్ట.. ప్రమాదకరం

గోతులు, పగుళ్లతో అధ్వానంగా రోడ్డు



● కొల్లూరు దగ్గర ఇరువైపులా కుంగిపోయిన కరకట్ట



● అత్తలూరివారిపాలెం-గొడవర్రు మధ్య ఏర్పడిన గుంతలు

- ఇసుక వాహనాలతో కుంగిపోయిన వైనం
- రోడ్డు ఆధునికీకరణ.. ప్రతిపాదనలకే పరిమితం

రేపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ప్రవాహాన్ని కట్టడి చేస్తూ.. ప్రజలకు ప్రధాన రవాణా మార్గంగా అందుబాటులో ఉన్న కరకట్ట ప్రమాదకరంగా మారింది. మోకాలి లోతున గోతులు.. కుంగిన రోడ్డుతో కరకట్టపై ప్రయాణం ఓ సాహసమేనని వాహన చోదకులు చెప్తున్నారు. రాకపోకల్లో ఏ మాత్రం ఆదమరిచినా 15 నుంచి 20 అడుగుల లోయలోకి వెళ్లిపోవాల్సిందేనని వాపోతున్నారు. 68 కిలోమీటర్ల పొడవున్న ఈ రోడ్డుపై రోజుకు కనీసం పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయంటే రోడ్డుపై ఉన్న గుంతలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. దశాబ్దం క్రితం ప్రకాశం బ్యారేజి నుంచి లంకెవానిదిబ్బ వరకు కరకట్టను ఆధునికీకరించారు. ఆ తర్వాత నుంచి దీనిని పట్టించుకున్నవారు లేరు. ఆ తర్వాత ఇసుక రవాణాను కరకట్టపైనే అనుమతించటంతో పూర్తిగా దెబ్బతినిపోయింది. కొన్నిచోట్లయితే మోకాళ్లలోతులో గుంతలుపడిపోతే, చాలాచోట్ల కరకట్ట నదివైపు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. తాడేపల్లి దగ్గర మణిపాల్ ఆసుపత్రి ఎదురు నుంచి కుడి కరకట్ట రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. కిలోమీటరు (మిగతా 8వ పేజీలో)

డీసీసీబీ మాజీ చైర్మన్‌పై కేసు

- రాము, మాజీ సీఈవో కృష్ణవేణిపైనా..
- గత పాలకవర్గ సభ్యులపైనా క్రిమినల్ చర్యలు

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నల్లపాడు బ్రాంచ్‌లో బోగస్ రుణాల వ్యవహారంలో భోక్తలపై కేసులు నమోదయ్యాయి. వైసీపీ హయాంలో బ్యాంకు చైర్మన్‌గా వ్యవహరించిన రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాల్‌పురం రాము), మాజీ సీఈవో టీ కృష్ణవేణి, నల్లపాడు బ్రాంచ్ మాజీ మేనేజర్ దేవరకొండ అరుణ కుమారితో పాటు పాలకవర్గ సభ్యులు 11 మందిపై నల్లపాడు పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. బోగస్ రుణాల పేరుతో దోపిడీపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో ఒక్క నల్ల పాడు బ్రాంచ్‌లో రూ.22 కోట్లపైనే అక్రమాలు జరిగి నట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే మాజీ సీఈవోలు కృష్ణవేణి, అజయ్‌కిశోర్‌లను సస్పెండ్ చేశారు. కాగా మాజీ చైర్మన్, మాజీ సీఈవో, బ్రాంచ్ మేనేజర్‌లతో పాటు అప్రైజర్ యర్రంశెట్టి ఈశ్వర్ ప్రసాద్, పాలకవర్గ సభ్యులు నల్లపాటి రామయ్య, కోట హరిబాబు, వట్టికొండ కోటేశ్వరమ్మ, పీట వెంకటేశ్వర్లు, డీ గోవిందనాయక్, వెలిశెల ఏడుకొండలు, కూనిశెట్టి శివనవీన్(ప్రొఫెషనల్ డైరక్టర్)లపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులు నమో దు సహకార శాఖలో కలకలం రేకెత్తించింది. మంగళగిరి, కురగల్లులో పీఏసీఎస్‌లలో కూడా రైతుల సొమ్ము స్వాహా చేయడం కూడా ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఆటో బోల్తాపడి మహిళ మృతి


శాయమ్మ (ఫైల్)

వినుకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని నీలగంగవరం గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎనుముల శాయమ్మ, వేమవరపు ఎస్తేరమ్మ, ఎనుమల పెద్ద జాన్, వేమవరపు సాలమ్మలు ఆటోలో మండలంలోని శివాపురం గ్రామంలోని చర్చి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని తిరిగి స్వగ్రామానికి ప్రయాణిస్తుండగా గ్రామానికి కిలోమీటరు దూరంలోని రోడ్డు మలుపు వద్ద ఆటో బోల్తాపడి ఎనుమల శాయమ్మ (50) మృతి చెందగా, వేమవరపు ఎస్తేరమ్మ, ఎనుమల పెద్ద జాన్, వేమవరపు సాలమ్మలకు గాయాలయ్యాయి. బంధువులు క్షతగాత్రులను వినుకొండ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పెద్ద జాన్ పరిస్థితి ఆందోళ నకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. శాయమ్మ మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రిస్మస్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండగ సెలవుల సందర్భంగా గుంటూరు మీదగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07196 చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 24, 30 తేదీల్లో రాత్రి 7.30 గంటలకు బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9కు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. నంబరు. 07195 కాకినాడటౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 28, 31 తేదీల్లో రాత్రి 7.50కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 8.30కి చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లలో ఫస్టు, సెకండ్, థర్డ్ ఏసీ, స్లీపర్, జనరల్ భోగీలుంటాయని సీపీఆర్‌వో తెలిపారు.

చైతన్య వంతులుగా ఓటర్లు

లోక్ సభలో ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు



గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో మంగళవారం జరిగిన చర్చలో టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రసంగించారు. గడిచిన కాలాన్ని పరిశీలిస్తే భారతీయ ఓటర్లు ఎంతో చైతన్యవంతంగా, విజ్ఞానంతో ఓటు హక్కును వినియోగించుకుంటున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఎన్నోసార్లు ఎన్నికలు జరిగాయని, ఓటర్లలోని ఆలోచనలతోనే గడిచిన కాలంలో ఎన్నో ప్రభుత్వాలు మారాయని, ఇది వారిలోని పరిపక్వతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఓటర్ల విజ్ఞానికి ఒక ఉదాహరణగా 1983లో తెలుగుదేశం పార్టీ అపూర్వ విజయం సాధించిందని తెలియజేశారు. మార్చి 1982లో తెలుగుదేశం పార్టీ ఏర్పడిందని, ఆ సమయంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్నంతగా వార్తాపత్రికలు, సోషల్ మీడియా, టెలివిజన్ ఛానళ్లు లేవని అన్నారు.

అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 294 నియోజకవర్గాలకు గానూ తెలుగుదేశం 200కి పైగా నియోజక వర్గాలలో విజయం సాధించిందని, 42 లోక్‌సభ స్థానాలకు గాను 30 స్థానాలను తొమ్మిది నెలల కాలంలోనే గెలుచుకుందని గుర్తు చేశారు. కొత్తగా పార్టీ ఏర్పడి, అధికారిక చిహ్నం కూడా లేని సమ యంలో కూడా మొదటి ఎన్నికల్లో ఇంత విజయం సాధించటాన్ని.. భారత ఓటర్ల తెలివితేటలు, జ్ఞానాన్ని ఎత్తి చూపిస్తుందని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పునరుద్ఘాటించారు. ప్రతిపక్ష కాంగ్రెస్ వారు ఓట్ల చోరీ, ఈవీఎంలపై తరచూ మాట్లాడుతున్నా రని, కర్ణాటక, తెలంగాణలో విజయం సాధించినప్పుడు వారు మాట్లాడలేద న్నారు. హర్యానాలో, ఇటీవల బీహార్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించిన ప్పుడు మాత్రమే వారు ఆరోపిస్తున్నా రన్నారు. ప్రజలు ఎంతో చైతన్యవంతంగా ఓటేస్తేనే విజయం సాధిస్తారనే విషయా న్ని గమనించాలని తెలిపారు. గడిచిన కాలాన్ని పరిశీలిస్తే ఎన్నికల సమయంలో జరిగే నేరాలపై చర్యలు తక్కువగా ఉన్నాయని వీటిపై చట్టబద్ధంగా ఉన్న చర్యలను పటిష్ఠం చేయాలని సూచించారు. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లోని పార్ట్ 9(ఏ) ఆర్టికల్ 243ను సవరించాలని, ప్రజలకు భరోసా ఇస్తూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు గాను రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను బలోపేతం చేయడానికి అన్ని పార్టీలు కలిసి రావాలని ఆయన అభ్యర్థించారు.

తెలంగాణ టూ ఆంధ్రప్రదేశ్

● బయో ఉత్పత్తుల అక్రమ రవాణా ● నరసరావుపేట కేంద్రంగా అన్ని ప్రాంతాలకు సరఫరా ● రూ. 12.28 లక్షల నిల్వలు పట్టుకున్న విజిలెన్స్


నరసరావుపేట లోని ట్రాన్స్‌పోర్ట్, పార్సిల్ కార్యాలయాలపై దాడులు నిర్వహిస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, ఏఓ సీహెచ్ ఆదినారాయణ

గుంటూరు సిటీ, నరసరావుపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గుంటూరు నుంచి నకిలీ మందులను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేసే బయోల మాఫియా ఇప్పుడు రూటు మార్చింది. పల్నాడు జిల్లా కేంద్రం అయిన నరసరావుపేట నుంచి నకిలీ బయో మందులు, అందుకు సంబంధించిన ఉత్పత్తులను రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్టు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో తేలింది. తెలంగాణ నుంచి ఊరు, పేరు లేని బయోలను నరసరావుపేట తెప్పించి అక్కడ నుంచి వివిధ జిల్లాలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గత మూడు రోజులుగా నరసరావుపేటలోని ట్రాన్స్‌పోర్ట్, పార్సిల్ కార్యాలయాలపై నిఘా వేసి లక్షలాది రూపాయలు విలువ చేసే బయో ఉత్పత్తులను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొని, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులకు అందజేశారు. ఈ దాడులలో 188.8 లీటర్ల బయో ఉత్పత్తుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ. 12.28 లక్షలు ఉంటుందని అధికారులు తేల్చారు. ఈ దాడులలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, విజిలెన్స్ ఏఓ సీహెచ్ ఆదినారాయణ, స్థానిక ఏఓ శాంతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి దుర్మరణం

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో ద్విచక్రవాహనంపై వెళుతున్న యువకుడిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ ఎస్సై చంద్రావతి తెలిపిన వివరాలు ప్రకారం ఉప్పరపాలెంకు చెందిన ఉసిరికాయల శివరాం (23) చీలురోడ్డుసెంటర్‌లోని బజ్జీల దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం దుకాణంలోకి ఆయిల్ తెచ్చేందుకు వెళ్ళి వస్తుండగా గుంటూరు వైపు వెళ్ళే లారీ ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా.. ఎడ్ల పోటీలు

విజేతగా పల్నాడు జిల్లా జత


పందెపు బండను లాగుతున్న ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గురజాల శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీల్లో భాగంగా మంగళవారం నాలుగుపళ్ల విభాగంలో పోటీలు జరిగాయి. దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 3909 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర మేళ్లచెరువుకు చెందిన కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, ప్రవలీష్‌రెడ్డి ఎడ్లజత 3882 అడుగులతో రెండోస్థానం, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం బసినేపల్లికి చెందిన యండ్లకండ్ల శ్రీనివాసులు ఎడ్లజత 3756 అడుగులతో మూడోస్థానం, బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతవరంకు చెందిన బుసి లీలాసాయిమనోహర్, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఆలా రాజేష్ యాదవ్ సంయుక్త ఎడ్లజత 3750 అడుగులు, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పమిడి అంజయ్య చౌదరి ఎడ్లజత 3750 అడుగులతో మూడు, నాలుగు స్థానాలను సమానంగా పంచుకున్నాయి. అలాగే పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యవరంకు చెందిన కడియం మణికంఠ ఎడ్లజత 3718 అడుగులతో ఐదోస్థానం దక్కించుకుంది. పోటీల అనంతరం విజేత ఎడ్లజత యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందించారు. కాగా మంగళవారంతో పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సహకారంతో పోటీలు విజయవంతంగా ముగిశాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నల్ల లక్ష్మయ్య, తన్నేటి బుచ్చిబాబు, నెల్లూరి మల్లయ్య, పోటు నాగేశ్వరరావు, విశ్వనాథం, నవులూరి శ్రీరామ్మూర్తి, చలవాది శ్రీను, షేక్ నాగుల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ రిజర్వేషన్ల సాధనకు పార్లమెంటు ముట్టడి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు


చలో ఢిల్లీ గోడప్రతులను ఆవిష్కరిస్తున్న కేసన శంకరరావు, నేతలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, చట్టసభల్లో ఓబీసీలకు జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు సాధించుకునేందుకు చలో ఢిల్లీకి పిలుపునిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం హలో బీసీ-చలో ఢిల్లీ తాలూకా గోడప్రతులను బీసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఓబీసీలకు రిజర్వేషన్లు కేటాయించే బిల్లును పాలక, ప్రతిపక్ష జాతీయ కూటములు ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు పరిమితి అసంబద్ధమైనదని, దానిని అధిగమించేందుకు పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన జంతర్ మంతర్ వద్ద మహాధర్నాతోపాటు పార్లమెంటు ముట్టడి కార్యక్రమం, 16న ఓబీసీలకు జనాభా దామాషా మేరకు రాజకీయ రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో చట్ట సవరణ చేసి ఓబీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని కోరుతూ జాతీయ స్థాయిలోని ప్రముఖులకు విజ్ఞాపన పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, నేతలు శివరాం బాబాజీ, కోలా అశోక్, మేకా వెంకటేశ్వరరావు, వాకా వెంకటేశ్వరరావు, జంజనం వరప్రసాద్, శివాజీ, ధనుంజయరావు, అడపా శ్రీనివాసరావు, సైదా తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం మంగళవారం నాటికి 576.80 అడుగులు ఉంది. ఇది 273.81 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసి ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 20,167 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 20,167 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

51,571 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 54,735 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,571 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,489 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11500	15500
273	---	---
341	10500	16500
4884	---	---
సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15700
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	16700
దేవనూరు డీలక్స్	11000	16300
ఆర్మూరు	10500	13000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16800
నెంబరు. 5	11000	15300
273	---	---
341	11000	16500
4884	---	---
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	11000	16900
దేవనూరు డీలక్స్	10500	16000
తాలుకాయలు	5000	7600

27 నుంచి జాతీయస్థాయి యోగా పోటీలు

ఏర్పాట్లను పరిశీలించిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27, 28, 29 తేదీలలో బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలోని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రయోగ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి యోగాసన పోటీలు జరుగనున్నాయి. దానికి సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పరిశీలించారు. జిల్లెళ్ళమూడి గ్రామంలో జాతీయ స్థాయి యోగాసన పోటీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం తరుపున పలువురు మంత్రులు అతిధులను ఆహ్వానించి ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించటం ద్వారా యోగా విశిష్టతను మరోమారు సమాజానికి చాటిచెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రయోగా అసోసియేషన్ అధ్యక్షులు కళ్ళం హరినాథరెడ్డి, కార్యదర్శి అల్లాడి రవికుమార్, వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళికృష్ణ, ప్రముఖ ఆడిటర్ చాపలసుబ్రహ్మణ్యం, శీలం శ్రీనివాసరావు, రెడ్డి నాగరాజు, డాక్టర్ సిద్దార్ద, వీరభద్రరావు, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


యోగాసన పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పులిచింతల ప్రాజెక్టు వద్ద మాక్ డ్రిల్



అచ్చంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టు వద్ద మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్ అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆక్టోపస్ డీఎస్పీ విశ్వనాథం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పులిచింతల ప్రాజెక్టుకు ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఎలా ఎదుర్కోవాలనే దానిపై అధికారులు సిబ్బందికి వివరించారు. అడవిలో నుంచి, నీటిలో నుంచి, ఆకాశం నుంచి అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే ఎలా ఎదుర్కోవాలనే దానిపై తెలిపారు. కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ విశ్వనాథంతో పాటు డీఎస్పీ మధు, పల్నాడు జిల్లా ఏఆర్ డీఎస్పీ జీఎం గంగిరెడ్డితో పాటు ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అచ్చంపేటలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు ఆక్టోపస్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 43.30 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 4,400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

రూ.165 కోట్లతో అభివృద్ధి పనులు

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా



(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

నిధుల కేటాయింపులో జడ్పీటీసీలకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నా. నిధులు కేటాయించే విషయంలో ఉమ్మడి జిల్లా లోని శాసనసభ్యులు పంపే ప్రతిపాదనలు పరిశీలించి ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత నాపై ఉంది. జడ్పీటీసీలు నిధులు అడిగినా.. ఎమ్మెల్యేలు నిధులు అడిగినా ఆ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసమే కదా?! అని, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా ప్రశ్నించారు. గుంటూరు జిల్లా పరిషత్‌లోని క్యాంపు కార్యాలయంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా మంగళవారం మాట్లాడుతూ గడచిన నాలుగేళ్ళలో రూ.165.91 కోట్లతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. జిల్లా పరిషత్‌కు మూల స్తంభం వంటి జడ్పీటీసీల ప్రతిపాదనలకు ఎప్పుడూ పెద్ద పీట వేశామని చెప్పారు. కేవలం నిధులు కేటాయింపు విషయంలో మాత్రమే కాకుండా ప్రోటోకాల్ వ్యవహారంలో కూడా చాలా మంది జడ్పీటీసీలు గతంలో అనేక ఫిర్యాదులు చేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యలు పరిష్కరించానని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి జిల్లా పరిషత్‌కు రావాల్సిన సర్‌చార్జి విడుదల కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నట్టు క్రిస్టీనా తెలిపారు. ఆ విషయం తెలుసుకోకుండా కొందరు ఆరోపణలు చేయటం హాస్యాస్పద మన్నారు. సర్ చార్జి విడుదల విషయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను రెండుసార్లు కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. జిల్లా పరిషత్ పరిధిలో ఏ పోస్టు ఖాళీ అయిన వెంటనే ఆ పోస్టుకు ప్రమోషన్ కల్పించేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది విద్యా దీవెన స్టడీ మెటీరియల్ వీలైనంత త్వరలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పదవతరగతి విద్యార్థులకు అందజేస్తామని, రూ. 61 లక్షలు వ్యయంతో సుమారు 34,747 మంది విద్యార్థులకు ఈ మెటీరియల్ అందజేస్తున్నామని తెలిపారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. మండల పరిధిలోని మొసలిపాడుకు చెందిన బోరుగడ్డ ఏస్తేరురాణి అనారోగ్యంతో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందారు. ఆమె ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో వైద్య ఖర్చులకు అయిన మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించి ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరగా స్పందించిన ఆయన ముఖ్యమంత్రి కార్యాలయానికి సిఫారసు చేశారు. కార్యాలయం నుంచి మంజూరైన రూ.2.50 లక్షల చెక్కును గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనంద బాబుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

మాస్టర్ ప్లాన్‌పై 11న అవగాహన సదస్సు : కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణ మాస్టర్ ప్లాన్ విధి విధానాలపై ఈనెల 11వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఈవిషయమై మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌పై పట్టణ ప్రజలు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు అభ్యంతరాలు తెలియజేయవచ్చు అన్నారు. ప్రజల అకాంక్ష మేరకు జనవరి 4వ తేదీ వరకు అభ్యంతరాలపై గడువు పెంచినట్లు తెలిపారు. 11వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి ప్రజలంతా పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. అభ్యంతరాలు రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు.


ప్రథమబహుమతి సాధించిన ఎం.హరీష్‌కు సర్టిఫికెట్, నగదును అందజేస్తున్న కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు

5కె, 3కె, 2కె రన్ పోటీలో విజేతలకు బహుమతులు

పిట్టలవానిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం కెవిఆర్‌కెవిఆర్ అండ్ ఎమ్‌కెఆర్ డిగ్రీకళాశాల క్రీడాప్రాంగణంలో నిర్వహించిన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రస్థాయి పురుషుల 5కె రన్, 3కె రన్, బాలికలు 2కె రన్ పోటీలు ఘనంగా జరిగాయి. 5కె రన్ పోటీలలో విజయనగరంకు చెందిన ఎం.హరీష్ ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, హైదరాబాద్‌కు చెందిన కె.శివ ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు, ఖాజీపాలేనికి చెందిన ప్రజ్ఞామనోహర్‌కు తృతీయ బహుమతిగా రూ.3 వేల నగదుతోపాటు మెమోంటోలను అందజేశారు. ఈ బహుమతులను కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, వైస్ ఛైర్మన్, కళాశాల ఉపాధ్యక్షుడు మంతెన శివరామరాజులతోపాటు విశిష్టఅతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ఇన్‌కంట్యాక్స్ అధికారి కొత్తపల్లి భాస్కర్‌రాజులు విజేతలకు అందజేశారు. 3కె రన్ విజేతలైన బాపట్లకు చెందిన వి.బాలసాయి మణిదీప్ ప్రథమ, చందోలుకు చెందిన షేక్ షహీద్ ద్వితీయ, బాపట్లకు చెందిన జి.శ్రీనుకు తృతీయ బహుమతులు అందజేశారు. 2కె రన్‌లో విజేతలైన ఖాజీపాలేనికి చెందిన బి.వాసంతి ప్రథమ, బాపట్ల మండలం మరుప్రోలువారిపాలేనికి చెందిన బ్రహ్మశ్రీ ద్వితీయ, పాండురంగాపురంనకు చెందిన సీహెచ్ హసినికి తృతీయ బహుమతి, సర్టిఫికెట్‌లను అందజేశారు. మంతెన వెంకటరాజు సేవాసమితి ఆధ్వర్యంలో చంపాటి చినసూరప రాజు సౌభాగ్యమ్మ సొసైటీ మర్రిపూడి వారి సౌజన్యంతో కళాశాల 45వ క్రీడా వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రసాద్, కళాశాల జాయింట్ సెక్రటరి మంతెన కృష్ణంరాజు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు పరిశ్రమలు స్థాపించాలి

● నరసరావుపేట రీజనల్ హెడ్ మాధురి


సమావేశంలో మాట్లాడుతున్న నరసరావుపేట రీజనల్ హెడ్ మాధురి

కర్లపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలు గ్రూప్ లోన్‌లు సక్రమంగా చెల్లిస్తూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను స్థాపిస్తూ ఉత్పత్తిదారులుగా ఎదగాలని నరసరావుపేట రీజనల్ హెడ్ మాధురి అన్నారు. కర్లపాలెం వాసవి శ్రీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో డ్వాక్రా యానిమేటర్లు, గ్రూప్ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మాధురి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు బ్యాంక్‌లో రుణాలు తీసుకుంటూ సకాలంలో చెల్లిస్తూ ఉండాలన్నారు. విద్య, స్వానిధి, ముద్రా, గృహ, వాహన తదితర అవసరమైన వారికి లోన్‌లు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. సకాలంలో కట్టి వారిని ఉత్తమ గ్రూప్‌ల వారిని ఎంపిక చేసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం యూనియన్ మేనేజర్ కె.మానస, బాపట్ల యూబీఐ మేనేజర్ కమలాకర్, డ్వాక్రా సీసీలు శివ కోటేశ్వరరావు, రాఘవ, సిబ్బంది భాను, శ్రీనివాసరావు, సందీప్, బీసీ పాయింట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకను ద్వితీయ సంవత్సర విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించటం జరిగిందని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి డి స్మిత్ అన్నారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా మొదటి సంవత్సరంలో అడుగుపెట్టిన విద్యార్థులు రాబోవు నాలుగు సంవత్సరాలలో కష్టపడి చదివి ఉత్తీర్ణులై మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.రవిబాబు, డాక్టర్ కెవి ఎస్.రామిరెడ్డి, డాక్టర్ బి.శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ డి.విజయ్‌కుమార్, డాక్టర్ బి.రాజుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్రెషర్స్‌డే వేడుకలో మాట్లాడుతున్న కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్

పదోన్నతి పొందిన డిప్యూటీ ఎంపీడీవోలకు ఘనసన్మానం


పదోన్నతి పొందిన వారిని సన్మానిస్తున్న మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలంలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తూ ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన బి.వి.జనార్దనరాజు, పల్నాటిశ్రీరాములు, బి.సుధాకర్, జున్ను మరియమ్మ, షేక్ అబ్దుల్‌ఖాదర్ జిలానీలను మంగళవారం బాపట్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. బాపట్ల ఎంపీపీ చినపోతుల హరిబాబు మాట్లాడుతూ సుదీర్ఘకాలం నుంచి పంచాయతీ కార్యదర్శులుగా ప్రజలకు విశేష సేవలందించిన వారికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించటం ఎంతో ఆనందదాయకమన్నారు. ఎంపీడీవో బి.బాబురావు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసిన ఐదుగురు పంచాయతీకార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి లభించటం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ మోహనరావు, వెలుగు ఏపీఎం సురేష్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



విద్యానుబంధ రంగాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నేటిపౌరులుగా ఎదగాల్సిన విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. విద్య అనుబంధ రంగాలపై సంబంధితశాఖల జిల్లా అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో ప్రతిభను గుర్తించి ఏ రంగాలపై ఆసక్తిగా ఉన్నారో అందులో ఉద్యోగవకాశాలు ఉన్న వాటిపై ప్రోత్సహించాలని తెలిపారు. విద్యారంగంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలన్నిటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సమర్థంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, జూనియర్ కళాశాలలపై పర్యవేక్షణ పెరగాలన్నారు. ప్రతి డిగ్రీకళాశాలలో ఎన్‌సీసీ తప్పనిసరిగా ఉండాలన్నారు. కళాశాలలో తరుచుగా జాబ్‌మేళా నిర్వహించాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్ బాపట్లలో భాగంగా విద్యారంగంలో కేపీఐసీ పక్కాగా సాధించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో పురుషోత్తం, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారిణి రాజాదెబోరా, బీసీ సంక్షేమశాఖాధికారిణి శివలీల, ఎస్టీ సంక్షేమశాఖాధికారి జి.అబ్బులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్‌కార్డులతో అనాధ పిల్లలకు మెరుగైన వైద్యం

ఎన్టీఆర్ హెల్త్‌కార్డుల ద్వారా అనాధ పిల్లలకు మెరుగైన వైద్యం ఉచితంగా అందుతుందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడిచే శిశుగృహంలోని అనాధ శిశువులకు ఎన్టీఆర్ హెల్త్‌కార్డులను కలెక్టర్ మంగళవారం అందజేశారు. నూతనంగా ప్రభుత్వం జారీ చేసిన ఎన్టీఆర్ హెల్త్ కార్డులను కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం శిశుగృహంలో ముగ్గురు అనాధ శిశువులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ రాధామాధవి, ఐసీడీఎస్ డీసీపీయూ పురుషోత్తం, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలలో ఆదాయ వనరులు పెంచుకోవాలి

గ్రామపంచాయతీలలో ఆదాయ వనరులు పెంచుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధితశాఖాధికారులతో కలెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధి కొరకు ఆదాయ వనరులను పెంచటానికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతం ఇంటిపన్నులు, నీటిపన్నులు బకాయిలు లేకుండా వసూళ్ళు చేయాలన్నారు. ఆదర్శగ్రామ యోజన కింద ఆయా గ్రామాలకు రూ.80 లక్షల నిధులు మంజూరయ్యాయని జాగ్రత్తగా వాటిని వినియోగించాలన్నారు. డీపీవో ప్రభాకరరావు, సర్వేల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ అల్తాఫ్, డ్వామా పీడీ విజయలక్ష్మీ, అన్నిమండలాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి : కొండమూది

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే అటల్-మోదీ సుపరిపాలన బస్సుయాత్రను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు పిలుపునిచ్చారు. బస్సు యాత్రకు సంబంధించిన గోడపత్రాలను మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీశ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ధర్మవరం నుంచి ప్రారంభమయ్యే బస్సుయాత్ర ఈనెల 16న బాపట్లకు చేరుకుంటుందన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని మూడు రోడ్డుల కూడలిలో మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహాన్ని అవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు, కూటమి నాయకులు పాల్గొంటారన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇసుక సునీల్, కొండారెడ్డి అనీల్‌కుమార్, జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, పి.సురేష్, కె.వెంకటరామకృష్ణ, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, పేరిరెడ్డి పాల్గొన్నారు.

బాపట్లలో మూడు ఇళ్లల్లో చోరీ

● బంగారు ఆభరణాలు, నగదు అపహరణ


రైలుపేటలో బీరువా పగలుగొట్టి పడేసిన దుస్తులు, ఇతర వస్తువులు

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. ఎత్తుగా ఉన్న వ్యక్తులు ముసుగు వేసుకొని అర్ధరాత్రులు కొన్ని గృహాలలో ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని రైలుపేటలో జి.వనజకుమారి ఇంట్లో ప్రవేశించిన దొంగలు బీరువా పగలగొట్టి బంగారు ఆభరణాలు, నగదు అపహరించినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదేప్రాంతానికి చెందిన మరో రెండు ఇళ్ళల్లోకి ప్రవేశించిన దొంగలుదొంగతనానికి పాల్పడినట్లు ఫిర్యాదులు చేశారు. దీంతో పట్టణ ఎస్సై చంద్రావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీలు సేకరించి దీనిపై దర్యాప్తు ముమ్మరం చేశారు.

జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల విశేష ప్రతిభ

పిట్టలవానిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన బాపట్ల నియోజకవర్గ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో ఖాజీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి బాలికల విభాగంలో 2కె రన్ పోటీలలో బెల్లంకొండ వాసంతి ప్రథమస్థానం సాధించి రూ.20వేల నగదు అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 9వ తరగతి విద్యార్థిని మధుప్రియ, కల్పన శివనాగపల్లవిలకు నగదు, సర్టిఫికెట్‌లను అందజేశారు. 3కె రన్ పోటీలలో నాగచరణ మణికంఠ, సాయిమణికంఠ సర్టిఫికెట్‌లు, నగదు అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేముల భూపతిరావు, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ సాంబమూర్తిరాజు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కరీముల్లా వారిని అభినందించారు.

ఎయిడ్స్ నియంత్రణకు లక్ష్యాలను పూర్తి చేయాలి

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ నియంత్రణ కోసం లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అప్సాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.మంజుల తెలిపారు. బాపట్ల ఏరియా వైద్యశాలలో మంగళవారం జిల్లాలోని ఐసీటీసీ, పీపీటీసీ, డీఎస్ఆర్‌సీ, ఎఆర్‌టి, ఎన్జీవోస్, లింక్‌వర్కర్స్ స్కీమ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డాక్టర్ మంజుల మాట్లాడుతూ ప్రతి హెచ్ఐవి పాజిటివ్ కేసులు ఏఆర్‌టి కేంద్రాలలో తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డాక్టర్ సోముల నాయక్, సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ, డాక్టర్ బాలసుధా, డాక్టర్ సాధిక్, శశిధర్‌రెడ్డి, జానీబాషా, చైతన్య, కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్వహణలోనే మెడికల్ కళాశాలలు ఉండాలి

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిర్వహణలోనే మెడికల్ కళాశాలలు ఉండాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల నిర్మాణం ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యానికి వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణకు సంబంధించిన పుస్తకాల ప్యాకింగ్ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ పుస్తకాలను ఈనెల 15న జీబీసీరోడ్డులోని దగ్గమల్లివారిపాలెం దగ్గర నుంచి ప్రదర్శనగా చీలురోడ్డు వరకు తీసుకొచ్చి అక్కడ నుంచి తాడేపల్లి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఎం.ఏడుకొండలురెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, నాయకులు జోగి రాజా, ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, కూనపరెడ్డి అవినాష్‌నాయుడు, ఇనగలూరి మాల్యాద్రి, కటికల యోహోషువా, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, అక్కల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ నాయకులు

11న మండల కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నిక

వేమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఈ నెల 11న మధ్యాహ్నం ఒంటి గంటకు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మృతి చెంది ఉన్నందున భర్తీ కాలేదని, భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. 11న ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ, 12 గంటలకు నామినేషన్ పరిశీలన, 12 నుంచి 1 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుందన్నారు. అనంతరం సభ్యులచే కో-ఆప్షన్ సభ్యుని ఎన్నిక జరుగుతుందని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు.

ధాన్యం రవాణాలో జీపీఎస్ ట్రాకింగ్ ఉపసంహరించుకోవాలి

కొల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం రవాణాలో జీపీఎస్ ట్రాకింగ్ నిబంధనను ఉపసంహరించుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు చేర్చే క్రమంలో జీపీఎస్ ఉన్న వాహనాల ద్వారా మాత్రమే రవాణా సాగించాలని ప్రభుత్వం పెట్టిన నిబంధనపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీపీఎస్ వాహనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం జీపీఎస్ నిబంధన సడలించి ధాన్యం సేకరించాలని రైతులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ వేతనాలను పెంపుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు కె.రూనీ అన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, వేతనాలు పెంపుదల చేయాలని ఈనెల 12న కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో ఎం.సుచిత్రకు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్‌ను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రేపల్లె ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎ.రత్నకుమారి, గౌరవాధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ తదితరులు పాల్గొన్నారు.

12న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కొల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లూరులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం : ఏవో

రేపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన వరి పంటలో ప్రతి గింజను కొనుగోలు చేస్తామని వ్యవసాయ శాఖ ఏవో మహేష్‌బాబు అన్నారు. మండలంలోని అరవపల్లి, నల్లూరుపాలెం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తేమ శాతం 17 ఉంటే వరి క్వింటాకు సాధారణ రకం రూ.2,369లు, గ్రేడ్ ఏ రకం రూ.2,389లు, 24 గంటల్లోపే నగదు రైతుల ఖాతాల్లో జమ చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ లక్ష్మణసాయి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

రేపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరం మండలం ఈదుపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యురాలు పాలెం షియో ప్రమాదం వల్ల ఇటీవల చనిపోయింది. మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు పార్టీ బీమా పథకం ద్వారా రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించారు. చెక్కును మంగళవారం భర్త పాలెం నాగేశ్వరరావుకు మంత్రి సోదరుడు అనగాని శివ ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు జీవీ నాగేశ్వరరావు, నాయకులు పిన్నిబోయిన చింతారావు తదితరులు పాల్గొన్నారు.

పంట దొంగలించారని వృద్ధురాలి ఫిర్యాదు

కొల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తాను పండించిన పంట దొంగలించారని ఓ వృద్ధురాలు, రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మండల గ్రామం దోనేపూడికి చెందిన నూతక్కి అనసూయమ్మ 55 సెంట్ల మాగాణి భూమిలో వరి పంట సాగు చేసింది. పంట నూర్పిడి చేసేందుకు పొలం దగ్గరకు వెళ్లగా అప్పటికే వరి పంటను యంత్రంతో కోత కోయించి ధాన్యం దొంగిలించారని గుర్తించింది. తహసీల్దార్ జి.వెంకటేశ్వర్లును ఆశ్రయించి వివరించగా స్పందించిన ఆయన తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఏఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు నాశనమౌతుంది : సీఐ

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు నాశనమౌతుందని పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. సూర్యలంకరోడ్డులోని ఎస్ఆర్ఐ కాలేజిలో యాంటీర్యాగింగ్, ట్రాఫిక్, నార్కోటిక్ డ్రగ్స్ నిషేధం, శక్తి టీమ్, సైబర్‌క్రైమ్ తదితర అంశాలు గురించి మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించటం వల్ల భవిష్యత్తు అంధకారమౌతుందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

సత్యవతమ్మ మృతికి పలువురి సంతాపం

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పెన్షనర్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి బొడ్డుపల్లి చిన్న వెంకటేశ్వర్లు సతీమణి సత్యవతమ్మ(94) మంగళవారం మృతి చెందారు. ఆమె మృతికి పలువురు నివాళులర్పించి ఆమె కుటుంబానికి సానుభూతి తెలిపారు.

నెహ్రూ యువకేంద్రం కార్యకలాపాలు మరింత బలోపేతం చేయాలి

● కేంద్రమంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవియాను కలిసిన ఎంపీ తెన్నేటి


కేంద్రమంత్రికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో నెహ్రూ యువకేంద్రం సంఘటన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నెహ్రూ యూత్ కార్ప్స్ పథకం కింద కార్యకలాపాలను మరింత బలోపేతం చేసి విస్తరించాలని కోరుతూ లోక్‌సభ ప్యానల్ స్పీకర్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ మంగళవారం ఢిల్లీలో కేంద్రయోజన వ్యవహారాలు, క్రీడాలశాఖా మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవియాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ బాపట్ల నెహ్రూ యువకేంద్రానికి తగినంత మానవవనరులు, లాజిస్టికల్ మద్దతును అందించి, దాని కార్యకలాపాలను బలోపేతం చేయాలని కోరటం జరిగిందన్నారు. నెహ్రూయూత్ కార్ప్స్ పథకం కింద యూత్ క్లబ్‌లు, యువవలంటీర్ల సంఖ్యను పెంచాలని కోరటం జరిగిందన్నారు. ఎన్‌వైకేసీ ద్వారా జిల్లా, మండల స్థాయిలో యువనాయకత్వం,వ్యక్తిత్వవికాస కార్యక్రమాలను నిర్వహించాలని కోరటం జరిగిందన్నారు. విద్య, ఫిట్‌నెస్, డ్రగ్స్ వ్యసన నిర్మూలన అవగాహన, డిజిటల్ అక్షరాస్యత, కమ్యూనిటి సేవపై దృష్టిసారించే ప్రత్యేక ఔట్‌రీచ్ కార్యక్రమాలకు మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేయాలని తెలిపారు. తన అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలించి ఈ కార్యక్రమాలను త్వరగా అమలు చేయటానికి అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కేంద్రమంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవియాను కోరటం జరిగిందని తెలిపారు.

అమరావతి అభివృద్ధిపై గేయం ఆవిష్కరణ

నిజాంపట్నం (రేపల్లె), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామానికి చెందిన యేమినేని రామాంజనేయులు అమరావతి రాజధాని అభివృద్ధిపై రాసిన నూతన గేయాన్ని మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈవో హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


అమరావతి రాజధానిపై రాసిన పాటను ఆవిష్కరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రైతు సేవాకేంద్రాలలో ధాన్యం విక్రయిస్తే గోనెసంచులు ఉచితం

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

కర్లపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం పంట సాగు చేసిన రైతులు ఎట్టి పరిస్థితులలో నష్టపోరాదనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. కర్లపాలెం, ఏత్రవారిపాలెం, సమ్మెటవారిపాలెం గ్రామాలలో కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఏత్రవారిపాలెంలో వివాదాస్పదమైన ప్రభుత్వభూమిని పరిశీలించారు. కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్‌లలో వ్యాపారస్తులను ఉద్దేశించి వ్యాపారాలు బాగానే సాగుతున్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ మార్కెట్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలను ఆసక్తిగా ఉండే అర్హులైన వారికి కేటాయించాలని అధికారులకు సూచించారు. కర్లపాలెం సచివాలయం, రైతు సేవాకేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు ధాన్యం తెచ్చుకోవటానికి గోనెసంచులు ఉచితంగా ఇస్తామన్నారు. గోనెసంచులు మీరుతెచ్చుకున్నట్లైతే అందుకు ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తుందన్నారు. రైతు సేవాకేంద్రంలో సిద్ధంగా ఉన్న 1233 గోనెసంచులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో పి.గ్లోరియా, పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీలక్ష్మీ, తహసీల్దార్ షాకీర్‌పాషా, ఎంపీడీవో శ్రీనివాసరావు, వీఆర్వో సాంబయ్య, పబ్లిక్ రిలేషన్ కార్యాలయాధికారి కె.కిరణ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఏవో సుమంత్‌కుమార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

షాదీఖానాకు రూ.30 లక్షలు మంజూరు

రేపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ముస్లీం మైనార్టీల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. 26వ వార్డులో షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయటంతో ముస్లిం మైనార్టీ నాయకులు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయనను దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వార్డుల పర్యటనలో భాగంగా షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరటంతో షాదీఖానా నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎన్నోసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, కమిటీ అధ్యక్షుడు షేక్ జమీర్, ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్, సెక్రటరీ మొహిద్దీన్, ముబీన్ తదితరులు పాల్గొన్నారు.


అనగాని శివప్రసాద్‌ను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటు : శివప్రసాద్

నగరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త అకాల మరణం పార్టీకి తీరనిలోటని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. తోటపల్లిలోని పార్టీ సీనియర్ కార్యకర్త చిట్టిమోతి వెంకటేశ్వరరావు పార్థివదేహానికి మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీకి అండగా ఉంటూ వెంకటేశ్వరరావు మృతి చెందటం తీరని లోటని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, అనగాని శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

రేపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగనున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ బాపట్ల జిల్లా కోశాధికారి సీహెచ్ మణిలాల్ అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 2వేల మంది ప్రతినిధులు, పలు దేశాల నుంచి కార్మికసంఘాల నాయకులు హజరుకానున్నారన్నారు. జనవరి 4వ తేదీన లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. అనంతరం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు.

మన సాగర్‌కి..
69 వసంతాలు

విజయపురిసౌత్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన జరిగి బుధవారంతో 69 వసంతాలు పూర్తి చేసుకుంది. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1955 డిసెంబరు 10వ తేదీన డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ రూపకల్పనకు ప్రముఖ ఇంజనీర్ కెఎల్ రావు, ముత్యాల జమీందార్ మహేశ్వరప్రసాద్‌ల ఆలోచనలు ఈ ప్రాజెక్ట్ రూపకల్పనకు మూలంగా చెప్పవచ్చు. ఈ ప్రాజెక్ట్ 1970లో నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు, ఇది 285 చ.కి.మీ. విస్తీర్ణం కలిగి 408 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని కలిగి ఉంది. గత 50 ఏళ్లుగా వచ్చిన వరదలకు రిజర్వాయర్‌లో పూడిక చేరడంతో సాగర్‌లో నీటి నిల్వ సామర్థ్యాన్ని 312 టీఎంసీలుగా ప్రభుత్వం నిర్ధారించింది. అంటే సుమారు 96 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని రిజర్వాయర్ కోల్పోయింది.

కుడి కాలువకు అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 1956 అక్టోబర్ 10న శంకుస్థాపన చేశారు. అనంతరం ఈ కాలువకు దివంగత ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న నీటిని విడుదల చేసి జాతికి అంకితమిచ్చారు. దీనిని జవహర్ కెనాల్ అని పిలుస్తారు. ఈ కాలువ గుంటూరు, ప్రకాశం జిల్లాలో సుమారు 203 కి.మీ. ప్రవహిస్తూ 11.74 లక్షల ఎకరాలుకు నీరందుతోంది.

సాగర్ ఎడమ కాలువకు లాలా బహుదూర్ కెనాల్ అని నామకరణం చేశారు. ఈకాలువకు 1959లో అప్పటి రాష్ట్ర గవర్నర్ భీమ్‌సేన్ సచార్ శంకుస్థాపన జరుపగా కుడి కాలువతోపాటే ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న ప్రారంభోత్సవం చేశారు. ఈ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తోంది. కృష్ణా డెల్టా ప్రాంత రైతులకు పంటలు పండించేందుకు ఉపయోగకరంగా ఉంది.

సాగర్ ప్రాజెక్ట్‌పై నిర్మించిన 410 మెగావాట్ల ప్రధాన జల విద్యుత్ కేంద్రం, కుడి కాలువపై 90 మెగా వాట్ల జలవిద్యుత్ కేంద్రం, ఎడమ కాలువపై 60 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రాలను నిర్మించారు. వీటికితోడు కుడి కాలువపై హైడల్ పవర్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ రాష్ట్రంలో సాగు, తాగునీటితోపాటు విద్యుత్ కొరతను కూడా తీరుస్తోంది.



నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన నాటి చిత్రం (ఫైల్‌ఫొటో)





కోలాహలంగా.. యువజనోత్సవం



నేటితో ముగియనున్న ఉత్సవాలు

ఏఎన్‌యూ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిత్రలేఖనం. మట్టి బొమ్మల తయారీ, పౌరాణిక నాటకాలు, చిత్తు కాగితాలతో బొమ్మల తయారీ, ఏకపాత్రాభినయాలు, వంటి అంశాలతో నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న యువజనోత్సవం రెండో రోజు మంగళవారం ఆహూతులను ఆకట్టుకుంది. విద్యార్థులతో పాటు వారి సహచర విద్యార్థులు తమ చరవాణీల ద్వారా వివిధ ఫోజులుతో సెల్ఫీలు తీసుకుంటూ క్యాంపస్ ప్రాంగణమంతా ఆనందంతో కలియతిరిగారు. బుధవారంతో యువజనోత్సవం ముగియనుంది. పోటీల్లో భాగంగా నేడు థియేటర్ విభాగంలో స్కిట్, ఫైన్ ఆర్ట్స్ విభాగంలో రంగోలీ, కార్టూనింగ్, స్పాట్ ఫోటోగ్రఫీ పోటీలు జరగనున్నాయి. అనంతరం జరిగే ముగింపు సభలో మూడు రోజులు పాటు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అత్యంత కళా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తారు.



21 నుంచి.. మంగళగిరి ప్రీమియర్ లీగ్

- మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా క్రికెట్ టోర్నీ
- రూ.3 లక్షలు, రూ.2 లక్షలు, రూ.లక్ష బహుమతులు
- నమోదు చేసుకున్న 128 జట్లకు మొదటి రౌండ్ డ్రా

మంగళగిరి సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనవరి 23వ తేదీన రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులైన నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా నిర్వహిస్తున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం


ఎంపీఎల్-4 మొదటి రౌండ్ డ్రా తీస్తున్న నందం అబద్దయ్య, నేతలు

కానుంది. నెల రోజులపాటు జరగనున్న ఈ పోటీలకు మంగళగిరి పట్టణంలోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్) ఆతిథ్యం ఇవ్వనుంది. ఎంపీఎల్-4 క్రికెట్ టోర్నీలో తలపడేందుకు 128 జట్లు ఇప్పటికే తమ పేర్లు నమోదు చేసుకోగా, ఆయా జట్ల మధ్య పోటీలకు సంబంధించి మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో మంగళవారం సాయంత్రం మొదటి రౌండ్ డ్రా తీసి పోటీ పడనున్న జట్ల వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలోని క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మంత్రి నారా లోకేశ్ మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారని, గెలుపోటములతో సంబంధం లేకుండా స్నేహపూర్వక వాతావరణలో క్రీడాకారులు పాల్గొనాలని కోరారు.

పులుల గణనపై సర్వే


పాదముద్రలు సేకరిస్తున్న అధికారులు

వెల్దుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయపురిసౌత్ రేంజ్ పరిధిలో గత ఎనిమిది రోజులుగా పులుల గణన జరుగుతోంది. వైల్డ్ లైఫ్ ఫారెస్ట్ రేంజర్ సుజాత ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి రేంజ్ పరిధిలో ఉన్న రెండు సెక్షన్లలోని 9 బీట్లలో ఈ గణన కొనసాగుతోంది. పులుల లెక్కింపుతో పాటు ఇతర మాంసాహార జంతువులను పాద ముద్రల ఆధారంగా గణన చేపట్టారు. ఈ గణనలో పెద్ద పులులతోపాటు చిరుత పులులు, రేసు కుక్కలు, ఎలుగుబంట్లు వంటి జాతుల లెక్కలు కూడా నిగ్గు తేల్చనున్నారు. అలాగే శాకాహార జంతువులు, గడ్డి జాతులు, చెట్ల గణన వంటి వాటిని కూడా ఈ లెక్కింపు ప్రక్రియలో భాగంగా చేపట్టనున్నారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ గణన తుది నివేదికలను అధికారులు త్వరలో వెల్లడించనున్నారు.

జోరుగా పేరేచర్ల-కొండమోడు హైవే పనులు

సత్తెనపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేరేచర్ల-కొండమోడు హైవే అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మేడికొండూరు మండలం పేరేచర్ల నుంచి రాజుపాలెం మండలం కొండమోడు మధ్య జరుగుతున్న ఈ పనులకు రూ 881.61 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించటంతో కాంట్రాక్టు సంస్థ పనులు ప్రారంభించింది. ప్రస్తుతం రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయి. ఒక్కో వైపు 8.75 మీటర్లు రెండు వైపులా మార్జిన్‌లు కలిపి మొత్తం 22.5 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ పూర్తయితే అమరావతితో పాటుగా గుంటూరు, పల్నాడు ప్రాంత ప్రజలు హైదరాబాద్ వెళ్లేందుకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయులు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హైవే అభివృద్ధి పనులు ప్రారంభించటానికి ఎంతగానో కృషి చేశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను ఇప్పటికే తొలగించారు. భారీ యంత్రాలతో రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ పరచి చదును చేస్తున్నారు. సత్తెనపల్లి, కొండమోడు వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు కూడా ప్రారంభించనున్నారు.


సత్తెనపల్లి - కొండమోడు మధ్య జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు

కరకట్ట ప్రమాదకరం

(5వ పేజీ తరువాయి)

పొడవున సింగిల్ రోడ్డుగా ఉండటంతో వాహనాలు తప్పుకునే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పెదకొండూరు-వల్లభాపురం మధ్య గతంలో 4 కిలోమీటర్ల పొడవున డబుల్ రోడ్డు వేసినా కిలోమీటరు వేయకుండా మాయచేశారు. అప్పటి నుంచి ఈ కొద్ది దూరం నరకప్రాయంగానే మారింది. వల్లభాపురం-హనుమాన్‌పాలెం మధ్య ఆధునికీకరించినా కట్ట దెబ్బతినిపోయింది. మున్నంగి పరిధిలో కరకట్ట పగుళ్లిచ్చి, సగం వరకు కుంగిపోయింది. హనుమాన్‌పాలెం నుంచి బాపట్ల జిల్లా కొల్లూరు మండలం ఈపూరు వరకు రోడ్డు పర్వాలేదన్నట్లున్నా, అక్కడి నుంచి కొల్లూరు వరకు నరకానికి రహదారిగా మారింది. కొల్లూరు-ఈపూరు,దోనేపూడి-వెల్లటూరుల మధ్య కిలోమీటరుపైగా విస్తరణకు నోచుకోలేదు. గతంలో వేసిన సింగిల్ రోడ్డు ఇరువైపులా నడుంలోతు వరకు కుంగిపోయింది. కార్ల రాకపోకలకు వీలు లేక పోగా లారీలు అదుపుతప్పుతున్నాయి.


కొల్లిపర-వల్లభాపురం మధ్య కుంగి పగిలిపోయిన కరకట్ట రోడ్డు

ముగ్గురు మంత్రులూ దృష్టిపెట్టాలి..

మంగళగిరి, తెనాలి, రేపల్లె నియోజకవర్గాల పరిధిలోని కరకట్ట పటిష్టతపై మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌లు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. నదికి ఎడమ వైపున ఉన్న కరకట్ట ఆధునికీకరణకు రూ.138 కోట్లతో తాజాగా నీటిపారుదల శాఖ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. అయితే కుడి కరకట్ట ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లావైపు మాత్రం ఇప్పటి వరకు దృష్టి పెట్టలేదు. గత ఏడాది వరద సమయంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లు రాత్రిళ్లు కూడా కరకట్టపైనే కాపలా ఉండి పటిష్టపరిచారు. ఆ సమయంలో కరకట్ట పనులు చేపడతామని వారు హామీ ఇచ్చారు. అయితే వరదలు తగ్గాక దీనిపై పెద్దగా కదలిక కనిపించలేదు. గతంలో రూ.100 కోట్లతో చేసిన ప్రతిపాదనలు ప్రస్తుతం రెట్టిపయ్యే పరిస్థితి ఉంది. అయితే ముగ్గురు మంత్రులు దీనిపై దృష్టిపెట్టి కరకట్టను బలోపేతం చేయటంతోపాటు, గతంలో ఆధునికీకరణ సమయంలో వదిలేసిన ప్రాంతాల్లో వెడల్పుతో పాటు ఎత్తు పెంచి డబుల్ రోడ్డు వేస్తేనే ఈ మార్గంలో ప్రయాణం సురక్షితం అవుతుంది.

ఎప్పుడో 1998లో రోడ్డేసి...

1998లో వచ్చిన వరదతో కరకట్టకు గండ్లు పడ్డాయి. దీంతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కరకట్ట ఎత్తు పెంచి, దానిపై తారుతో సిగిల్ రోడ్డు వేశారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు ఇదే రక్షణగా నిలిచింది. అయితే రోడ్డుపడ్డాక వాహనాల రద్దీ పెరిగింది. రూ.111 కోట్లతో 2010లో పనులు పూర్తి చేశారు. ప్రకాశం బ్యారేజి నుంచి పెనుమూడి వరకు కరకట్టను వెడల్పు చేసి, దానిపై డబుల్ రోడ్డు వేశారు. ఆ తర్వాత ఈ మార్గంలో రేపల్లె-విజయవాడ కరకట్ట బస్సు సర్వీసును కూడా ప్రారంభించారు. అయితే జగన్ ప్రభుత్వంలో కరకట్టపై ఇసుక రవాణాను అనుమతించారు. 40 నుంచి 50 టన్నులకుపైగా బరువుతో ఇసుక లారీలు విచ్చలవిడిగా తిరగడంతో రోడ్డు కుంగిపోయింది. నదివైపు అంచులు సగం వరకు కుంగి అత్యంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు పునర్ నిర్మాణం కోసం రూ.100 కోట్లతో నీటిపారుదల శాఖ పలు సార్లు ప్రతిపాదనలు పంపినా వైసీపీ ప్రభుత్వం వాటిని బుట్టదాఖలు చేసింది.

కొనుగోళ్లు కొంతే

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కళ్లాల్లోనే ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో వ్యవసాయ శాఖ, మార్కెటింగ్‌శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణి.. మిల్లర్లు ఆడిందే ఆటగా పరిస్థితి నెలకొనడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మద్దతు ధరకు ధాన్యం సేకరణ బాలారిష్టాల దశలో ఉండటంతో బహిరంగ మార్కెట్ కొనుగోళ్లను పట్టించుకునే వారే లేకుండా పోయారు. మొత్తం దిగుబడిలో ప్రభుత్వాలు సేకరించేది గరిష్ఠంగా 30 శాతానికే పరిమితం. మిగిలినదంతా కూడా బయట మిల్లుల్లోనో, దళారుల వద్దకు చేరేదే. అయితే లక్ష్యాల మేర కొనుగోళ్లపై పర్యవేక్షించాల్సిన అధికారులు వాటిని కూడా పట్టించుకోవడంలేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ మాత్రమే తమ పరిధిలోకి వస్తుందని, మిగతాదేదీ తమకు పట్టదన్నట్లు ఆయా విభాగాలు వ్యవహరిస్తున్నాయి. విభాగాల మధ్య సమన్వయం లేకపోగా ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటూ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో రైతులు అంతిమంగా నష్టపోవాల్సి వస్తోంది.

పర్యవేక్షణ పట్టదు..

మిల్లర్లు, దళారులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినా మద్దతు ధర ప్రామాణికం. అయితే మద్దతు ధరతో పనే లేదన్నట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితి ఉంది. ప్రభుత్వ కేంద్రాల ద్వారా మిల్లులకు తరలిన ధాన్యంపై ఏ అనే పేరుతో రిజిస్టర్ నిర్వహించాలి. ప్రైవేటుగా మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యానికి బీ అనే పేరుతో రిజిష్టర్ నిర్వహించాలి. ఏ రైతు నుంచి ఎంత ధరకు, ఎంత పరిమాణం కొనుగోలు చేశామనే సమగ్ర వివరాలు అందులో నమోదు చేయాలి. దీనిని డీఎస్‌వో సారథ్యంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ పర్యవేక్షించాలి. కానీ ఎక్కడా ఈ ప్రక్రియ కనిపించడంలేదు. ఏ గ్రామం పరిధిలో ఎంత పరిమాణం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లింది, ఎంతమేర బయటకు తరలివెళ్లింది అనే గణాంకాలను వీఏఏ కచ్చితంగా నమోదు చేయాలి. ఈ రికార్డూ లేదు. లక్షల టన్నుల ధాన్యం బయటి మార్కెట్‌కు తరలివెళుతుందని ఆయా విభాగాలకు తెలిసి కూడా, మామూళ్ల మత్తులో జోగుతూ తనిఖీలు మరిచారు. దళారులకు రైతులు అమ్ముకునే ధాన్యం వివరాలను వ్యవసాయ శాఖ సహకారంతో రెవెన్యూ రెగ్యులేట్ చేయాలి. ధాన్యం సేకరణలో తమకు సంబంధం లేదన్నట్లు రెవెన్యూ విభాగం వ్యవహరిస్తోంది. దీంతో ధాన్యం కొనుగోలు విషయంలో దళారులు ఆడింది ఆట, పాడిందిపాటగా కనిపిస్తోంది. మిల్లర్లు చెప్పిందే ధరగా చెలామణి అవుతుండడంతో అన్నదాతలు ఈ విషయమై వ్యవసాయశాఖను వివరణ కోరితే ఇది సివిల్ సప్లయిస్ విభాగం పరిధిలోనిదని చెప్పడం గమనార్హం. వ్యవస్థలన్నీ నిద్రావస్థలో ఉండడంతో బయటి మార్కెట్‌లో మరీ తీసికట్టుగా ధాన్యాన్ని రూ.1100 నుంచి రూ.1300కు కూడా అడుగుతూ రైతులను నిలువునా ముంచేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌కు ఇప్పటికే తరలివెళ్లిన లక్షన్నర టన్నుల ధాన్య విషయంలో ఇదే జరిగింది.

మిల్లర్లకే వత్తాసు

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు కొనుగోలు విషయంలో కొర్రీలతో సరిపెడుతున్నారు. రైతుకు షెడ్యూల్ ఇచ్చిన తర్వాత ట్రక్ షీట్, జీఎల్‌టీ, ఎఫ్‌టీవో జారీతో ప్రక్రియ ముగిసినట్లే. ఈ దశలో ఎక్కడా కూడా రైతుకు నేరుగా మిల్లర్‌తో సంబంధమే ఉండకూడదు. షెడ్యూల్ ఇచ్చేటప్పుడు మాత్రం మిల్లు ఎంపిక మాత్రం రైతు ఇష్టాన్ని బట్టి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో మిల్లర్లు ధాన్యానికి కొర్రీలు పెడుతూనే ఉన్నారు. ఆర్‌ఎస్‌కే సిబ్బంది మిల్లర్లతో కలిసి మాయాజాలానికి తెరలేపడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఓసారి తేమ విషయంలో ఆర్‌ఎస్‌కేలో ఫైనలైజ్ అయిన తర్వాత మళ్లీ మిల్లు దగ్గర దాని విషయంలో కిరికిరి పెట్టడం వెనక మతలబు ఇదే. వాటిని పరిష్కరించాల్సిన ఆర్‌ఎస్‌కే టెక్నికల్ అసిస్టెంట్, మిల్లు కస్టోడియన్ అధికారులు మిల్లర్లకే వత్తాసు పలుకుతున్నారు.

షిర్డీ రెగ్యులర్ వీక్లీ ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు కూత

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి - సాయినగర్ షిర్డి రెగ్యులర్ వీక్లీ ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు గుంటూరు రైల్వేస్టేషన్‌లో కూత పెట్టింది. ఈ రైలుని మంగళవారం ఉదయం 11.10 గంటలకు న్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో రైల్వే సహాయ మంత్రి సోమన్న పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి మీదగా సాయంత్రం 6.09 గంటలకు గుంటూరుకు చేరుకొని 6.45కి బయలుదేరి వెళ్లింది. బుధవారం మధ్యాహ్నం 2.45కి నాగర్‌సోల్, సాయంత్రం 6.35కి సాయినగర్ షిర్డి చేరుకొంటుందని రైల్వేవర్గాలు తెలిపాయి. కాగా రెగ్యులర్ వీక్లీ రైలు మాత్రం ఈ నెల 14వ తేదీ నుంచి ప్రతీ ఆదివారం వేకువజామున 4 గంటలకు తిరుపతిలో బయలుదేరి ఉదయం 8.48కి చీరాల, 9.53కి తెనాలి, 10.40కి గుంటూరుకు చేరుకొని సాయినగర్ షిర్డికి బయలుదేరుతుంది. కాగా ఆదివారం మధ్యాహ్నం నరసపూర్ - నాగర్‌సోల్ బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఒకే రోజున రెండు రెగ్యులర్ రైళ్లు షిర్డికి ఏర్పాటు చేయడం ప్రయాణీకులకు అంతగా ఉపయోగం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో బుధవారం ఇక్కడి నుంచి బయలుదేరి గురువారం షిర్డికి చేరుకొనేటట్లు అయితే ప్రయాణీకుల ఆదరణ బాగా ఉంటుందని చెబుతున్నారు.


తిరుపతి - సాయినగర్ షిర్డీ రెగ్యులర్ వీక్లీ ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు

చోర్ గ్యాంగ్ లీడర్ తండ్రి
ఏఎస్‌ఐ బదిలీ

ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి కేసులో కదలిక

నరసరావుపేట లీగల్, చిలకలూరిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట బైపాస్‌లో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతికి కారణమైన చోర్ గ్యాంగ్ లీడర్, నకిలీ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మదమంచి వెంకటనాయుడు తండ్రి ఏఎస్‌ఐ మదమంచి శ్రీనివాసరావుపై ఎట్టకేలకు వేటు పడింది. నరసరావుపేటపేట డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్‌ఐగా ఉన్న శ్రీనివాసరావుపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అయితే పలుకుబడి, హై ప్రొఫైల్, రాజకీయ అండదండలతో 15 ఏళ్లుగా నరసరావుపేట పోలీస్ సబ్ డివిజన్లోనే వివిధ హోదాల్లో బాధ్యతలు ఆయన నిర్వహించాడు. కాగా ఈ నెల 4న జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఏఎస్‌ఐ కుమారుడు ప్రధాన నిందితుడిగా ఉన్నతాధికారులు నిర్ధారించారు. ఈ క్రమంలో డీఐజీ, ఎస్పీ జోక్యంతో ఎట్టకేలకు శ్రీనివాసరావును గురజాల సబ్ డివిజన్‌లోని వెల్దుర్తికి బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దర్యాప్తును పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

చిలకలూరిపేట బైపాస్ రోడ్డులో ఇంజనీరింగ్ విద్యార్థుల మృతికి సంబంధించిన కేసు దర్యాప్తును ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. నరసరావుపేటకు చెందిన ఐదుగురు సభ్యుల చోర్ గ్యాంగ్ వాడిన కార్లు, గతంలో చేసిన నేరాలు, సహకరించిన వారు ఎవరు, ఎంత కాలంగా వీరు నేరాలు చేస్తున్నది తదితర వివరాలను సేకరిస్తున్నారు. నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ ఎం హనుమంతరావు చిలకలూరిపేటలోనే మకాం చేసి నిందితులను విచారిస్తున్నారు. కుమారుడు చేసిన నేరాల్లో ఏఎస్‌ఐగా ఉన్న తండ్రి పాత్ర ఎంత మేరకు ఉన్నదన్న విషయంతో పాటు ఆయనకు శాఖలో ఇంకా ఎవరైనా తోడ్పడ్డారా అనే విషయంపై కూపీ లాగుతున్నారు.

పాఠశాలల్లో..
అంగన్‌వాడీ కేంద్రాలు

- పైలెట్ ప్రాజెక్టుగా క్రోసూరు మండలం



సత్తెనపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆరు నుంచి 14 సంవత్సరాలలోపు ఉన్న చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను ఒకే దగ్గర అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలను సమీప ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించేందుకు కో లొకేషన్ ప్రోగ్రాంకు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా పల్నాడు జిల్లాలో క్రోసూరు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు.

ఐదు వందల మీటర్ల దూరం లోపు

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని ఎంపిక చేశారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ సంయుక్తంగా పని చేస్తాయి. పిల్లలకు పౌష్టికాహారం అందించటంతో పాటు ప్రాథమిక విద్యకు దూరంగా కాకుండా సేవలను బలోపేతం చేయటం ప్రాజెక్టు ఉద్దేశం. ఇందులో భాగంగా అంగన్ వాడీ కేంద్రాలను రెండు వందల నుంచి ఐదు మీటర్ల దూరంలో ఉన్న పాఠశాలల్లో కలిపి నిర్వహిస్తారు. క్రోసూరు మండలంలో 59 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. కేంద్రాలు పాఠశాలల్లో మౌళిక వసతులు, భవన స్థితిగతులను పరిశీలించేందుకు మండల స్థాయిలో కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఎంఈవో, కో చైర్మన్‌గా సీడీపీవో, సభ్యులుగా అంగన్ వాడీ పర్యవేక్షకులు, ఇతర సభ్యులు ఉంటారు.

ఏమి గుర్తిస్తారంటే...

పాఠశాలల్లో తరగతి గదులు, మరుగు దొడ్లు, తాగు నీటి సౌకర్యం, వంట గది, ఆట స్థలాలు, స్టోర్ రూమ్, ప్రవేశ ద్వారాలు, ప్రహరీ తదితర అంశాలను పరిశీలిస్తారు. మ్యాపింగ్ చేసి నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపిస్తారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహద పడేలా ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా క్రోసూరు మండలాన్ని ఎంపిక చేసిందని ఐసీడీఎస్ పల్నాడు జిల్లా పీడీ ఉమాదేవి తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్ వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించేందుకు విద్యా శాఖ అధికారులతో చర్చించాల్సి ఉందని తెలిపారు.



బాపూజీ కాంప్లెక్స్ వద్ద రోడ్డు మీదనే ఉన్న దుకాణాలు



ఇరుగ్గా మారిన గాంధీరోడ్డు



కోర్టు సెంటరులో రోడ్డు పైనే వాహనాల పార్కింగ్

అడ్డగోలుగా.. ఆక్రమణలు!

- సైడు కాలువల పైనా నిర్మాణాలు
- అద్దెలకు ఇచ్చి చిరువ్యాపారుల నుంచి రూ.వేలల్లో వసూలు
- రోడ్ల విస్తరణ జరిగినా మారని తీరు
- ట్రాఫిక్ సమస్యతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



ఆర్టీసీ బస్టాండు వద్ద నడిరోడ్డులో ఉన్న తోపుడు బండ్లు



కొత్తపట్నం బస్టాండు ప్రాంతంలో ఇలా..

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పలు ఫుట్‌పాత్‌లను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. పలు చోట్ల స్థానిక షాపు యజమానులే ఫుట్‌పాత్‌లను, సైడు కాలువలను చిరువ్యాపారులకు అద్దెలకు కేటాయిస్తూ రూ.వేలకు వేలు దండుకుంటున్నారు. కార్పొరేషన్ స్థలం కనిపిస్తే కబ్జాలకు కొందరు పాల్పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు అలసత్వం కారణంగా అనేక ప్రాంతాల్లో స్థలాలు, ఫుట్‌పాత్‌లు అన్యాక్రాంతానికి గురౌతున్నాయి. ఇప్పటికే పలు కార్పొరేషన్‌కు చెందిన కొన్ని స్థలాలను కొందరు ఆక్రమించి ఏళ్ళ తరబడి అనుభవిస్తుండగా, నిర్మాణాలు తొలగించి స్వాధీనం చేసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. నగరంలో వందల సంఖ్యలో ప్రభుత్వ రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇదిలా ఉండగా, వివిధ వ్యాపారాల నిమిత్తం మరెన్నో తాత్కాలిక ఆక్రమణలు ఉన్నాయి. తొలుత చిరువ్యాపారం కోసం కొంతమేర జాగా ఏర్పాటు చేసుకోవడం. ఆ తర్వాత శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు.

చిరు వాప్యారాల నుంచి రూ.వేలల్లో దోపిడీ

నగరంలోని పలు ప్రాంతాలలో వేల సంఖ్యలో వీధి వ్యాపారులు వివిధ రకాల విక్రయాలతో జీవనం సాగిస్తున్నారు. అధిక శాతం తోపుడు బండ్లపై, ఫుట్‌పాత్‌లపై పండ్లు, కూరగాయలు, టిఫిన్, బట్టలు, చెప్పులు, వివిధ వస్తువులు, నూడిల్స్ పాయింట్‌లు, సమోసాలు, స్వీట్‌కార్న్, పుల్కా పాయింట్, పూల వ్యాపారాలు వంటివి అమ్మకాలు సాగిస్తుంటారు. ఈ వ్యాపారాలు సాగించేందుకు ప్రతిరోజు కార్పొరేషన్‌లకు రోజువారీ రుసుము చెల్లించాల్సి ఉంది. అయితే ట్రాఫిక్ సమస్య తలెత్తినపుడల్లా ఖాకీలు వారి బండ్లను పక్కకు నెట్టేయడం నిత్యకృత్యం. దీంతో వ్యాపారులు పలు షాపుల యజమానులను ఆశ్రయించడంతో వారి దుకాణం ముందు సాయంత్రం బండిని నిలుపుకుని చిరు వ్యాపారం చేసుకునేందుకు విన్నవించుకోగా, యజమానులు వారి వద్ద నుంచి రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు వసూలు చేయడం ఇదో తరహా వ్యాపారమైంది. అంతే కాకుండా షాపు యజమానే కరెంటు ఇచ్చేందుకు అదనంగా రోజుకు రూ.100 వసూలు చేస్తున్నారు. దీంతో ఒక్కో షాపు యజమాని తమ షాపు ముందు వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించినందుకు రోజుకు రూ.600 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో చిరువ్యాపారుల వద్ద నుంచి నెలకు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు వసూలు చేస్తున్న వారు అధిక సంఖ్యలోనే ఉన్నారు.

రోడ్లను విస్తరించినా...

ఒంగోలు నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తగా రోడ్ల నిర్మాణం, ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతాల్లో రోడ్ల విస్తరణతోపాటు, ట్రాఫిక్ సమస్య నియంత్రణలోనూ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికే సీవీఎన్ రీడింగ్‌రూమ్ సెంటర్, రంగారాయుడు చెరువు ఏరియా, కర్నూలు రోడ్, శ్రీనివాస థియేటర్ రోడ్, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, గుంటూరు రోడ్ విస్తరించగా, త్వరలోనే చర్చి సెంటర్ నుంచి మస్తాన్‌దర్గా సెంటర్ వరకు ట్రంక్ రోడ్ విస్తరణ, అలాగే మస్తాన్‌దర్గా నుంచి బీవీఎస్ హాలు మీదుగా కొత్తపట్నం బస్టాండ్ వరకు రోడ్డు విస్తరణ చేయనున్నారు. అయితే ప్రజల సౌకర్యార్థం పాలకులు ప్రత్యేక చొరవ తీసుకుంటుండగా, కొందరు వ్యాపారాలు రోడ్డు విస్తరించిన ప్రాంతాల్లో తిరిగి దుకాణాలు ఏర్పాటు చేయడం, ఆక్రమించి అద్దెలకు కేటాయించడం జరుగుతుంది. మరోవైపు విస్తరించిన రోడ్‌ను తిరిగి వాహన పార్కింగ్‌గా ఉపయోగించుకోవడంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు.

చూసీ చూడనట్లుగా టౌన్‌పానింగ్

నగరంలో వీధి వ్యాపారులకు జోన్‌లు కేటాయించినా అవి ఉపయోగపడటం లేదు. దీంతో చిరువ్యాపారుల జీవనం పెద్ద వ్యాపారులకు కాసులు కురిపిస్తుండగా, ఫుట్‌పాత్‌లు, సైడు కాలువలను ఆక్రమించి అద్దెకు కేటాయిస్తున్నవారిపై చర్యలు తీసుకోవడంలో టౌన్ ప్లానింగ్ యంత్రాంగం విఫలమవుతుంది.

పరిష్కారం వైపు దృష్టి సారిస్తేనే..

నగరంలో ట్రాఫిక్ సమస్య ఒక్కరోజుతో పోయేది కాకపోవడంతో శాశ్వత పరిష్కారం వైపు యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉంది. ప్రధానంగా మినీ స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు, అలాగే డీమార్ట్, జీజీహెచ్, రమ్య హోటల్ సెంటర్, పెట్రోల్ బంక్ ఏరియా, ఎల్ఐసీ ఎదురు, అలాగే అంజయ్య రోడ్, మంగమూర్ రోడ్, సీవీఎన్ సెంటర్, కోర్టు సెంటర్, సాయిబాబా గుడి సెంటర్‌తోపాటు పలు ఏరియాలలో రహదారులపై నాలుగు చక్రాల వాహనాలు నిలిపివేత అరికట్టడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు పార్కింగ్ లేకుండా చూడాల్సి అవసరం ఉంది.

గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో కార్పొరేషన్ అధికారులు వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా జోన్‌లు ఏర్పాటు చేయగా, వైసీపీ వచ్చాక వాటిని గాలికి వదిలేశారు. ఇప్పటికైనా దీనిపైనా పోలీసు యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగవాసులు కోరుతున్నారు.



కర్నూలురోడ్డులో వాహనాల పార్కింగ్



లాయర్‌పేటలో రోడ్డుపైనే తోపుడు బండ్లు



నెల్లూరుబస్టాండులో కేబీ వద్ద..

మల్లవరంలో సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.76 లక్షలు కేటాయింపు

మద్దిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మల్లవరంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం రూ.76 లక్షల నిధులను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కేటాయించినట్లు మల్లవరం శ్రీవారి కమిటీ గౌరవాధ్యక్షుడు కావూరి వాసుబాబు, అధ్యక్షుడు మారినేని కృష్ణారావు మంగళవారం తెలిపారు. శ్రీవారి కమిటీ ఆధ్వర్యంలో శ్రీగిరి ప్రదక్షణకు సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను శరవేగంగా పూర్తి చేయన్నారు. గ్రామస్థుల సహకారంతో రూ.13 లక్షల నిధులను కేటాయించి సిమెంట్‌రోడ్డు నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. దాదాపు రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గౌరవాధ్యక్షుడు కావూరి వాసుబాబు మాట్లాడుతూ మల్లవరం దేవస్థానం శ్రీవారి కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో ఔషధ మొక్కలను నాటినట్లు తెలిపారు. మరింత అభివృద్ధి కోసం కమిటీ ఆధ్వర్యంలో పనులను పూర్తిచేస్తామని తెలిపారు. దాతల సహకారంతో మరింత ముందుకు వెళతామని చెప్పారు. కార్యక్రమంలో మన్నం శ్రీనివాసరావు, తేళ్ల సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న ఏపీఎం తదితరులు

చినగంజాం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాల ద్వారా తమ జీవనోపాధిని పెంపొందించుకోవాలని సంతరావూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మి, ఏపీఎం గద్దె పెదసుబ్బారావులు అన్నారు. మండలంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సంతరావూరుశాఖ కార్యాలయంలో గ్రామానికి చెందిన 11 మంది లబ్దిదారులకు రుణాల చెక్కులను వారు బ్యాంకు ఫీల్డ్ అధికారితో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సంతరావూరుశాఖ పరిధిలో రూ.25లక్షల రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. లాక్‌పతిదీదీ పథకం కింద పది మంది లబ్ధిదారులకు లక్షరూపాయిల చొప్పున పది లక్షల రూపాయిలు, ఒక లబ్దిదారునికి పీఎం ఈజీపీ కింద రూ.15లక్షలు టెంట్‌హౌస్ నిమిత్తం మంజూరు పత్రం ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ అధికారి మనోజ్, సీసీ మాధవీ, వీవోఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలి

బల్లికురవ, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల సాధనకు ఈ నెల 31వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు వైజాగ్‌లో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని బాపట్ల జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మండలంలోని గుంటుపల్లి పీహెచ్‌సీ వద్ద ఆశడే సందర్భంగా ఆశ వర్కర్లతో కలిసి మహాసభల పోస్టర్‌ను సీఐటీయూ నేతలు అవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల భద్రతకు చట్టాలను తీసుకురావాలన్నారు. వైజాగ్ స్టీల్‌ను ప్రైవేట్ పరం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లేబర్ కోడ్ రద్దు చేయాలన్నారు. ఆశవర్కర్ యూనియన్ నేతలు వరలక్ష్మీ, శివలీల, భారతీ, గోపీ రాణి, నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట ప్రమాదకరం

(5వ పేజీ తరువాయి)

పొడవున సింగిల్ రోడ్డుగా ఉండటంతో వాహనాలు తప్పుకునే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పెదకొండూరు-వల్లభాపురం మధ్య గతంలో 4 కిలోమీటర్ల పొడవున డబుల్ రోడ్డు వేసినా కిలోమీటరు వేయకుండా మాయచేశారు. అప్పటి నుంచి ఈ కొద్ది దూరం నరకప్రాయంగానే మారింది. వల్లభాపురం-హనుమాన్‌పాలెం మధ్య ఆధునికీకరించినా కట్ట దెబ్బతినిపోయింది. మున్నంగి పరిధిలో కరకట్ట పగుళ్లిచ్చి, సగం వరకు కుంగిపోయింది. హనుమాన్‌పాలెం నుంచి బాపట్ల జిల్లా కొల్లూరు మండలం ఈపూరు వరకు రోడ్డు పర్వాలేదన్నట్లున్నా, అక్కడి నుంచి కొల్లూరు వరకు నరకానికి రహదారిగా మారింది. కొల్లూరు-ఈపూరు, దోనేపూడి-వెల్లటూరుల మధ్య కిలోమీటరుపైగా విస్తరణకు నోచుకోలేదు. గతంలో వేసిన సింగిల్ రోడ్డు ఇరువైపులా నడుంలోతు వరకు కుంగిపోయింది. కార్లు రాకపోకలకు వీలు లేక పోగా లారీలు అదుపుతప్పుతున్నాయి.

ముగ్గురు మంత్రులూ దృష్టిపెట్టాలి..

మంగళగిరి, తెనాలి, రేపల్లె నియోజకవర్గాల పరిధిలోని కరకట్ట పటిష్టతపై మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌లు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. నదికి ఎడమ వైపున ఉన్న కరకట్ట ఆధునికీకరణకు రూ.138 కోట్లతో తాజాగా నీటిపారుదల శాఖ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. అయితే కుడి కరకట్ట ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లావైపు మాత్రం ఇప్పటి వరకు దృష్టి పెట్టలేదు. గత ఏడాది వరదల సమయంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లు రాత్రిళ్లు కూడా కరకట్టపైనే కాపలా ఉండి పటిష్ట పరిచారు. ఆ సమయంలో కరకట్ట పనులు చేపడతామని వారు హామీ ఇచ్చారు. అయితే వరదలు తగ్గాక దీనిపై పెద్దగా కదలిక కనిపించలేదు. గతంలో రూ.100 కోట్లతో చేసిన ప్రతిపాదనలు ప్రస్తుతం రెట్టిపయ్యే పరిస్థితి ఉంది. అయితే ముగ్గురు మంత్రులు దీనిపై దృష్టిపెట్టి కరకట్టను బలోపేతం చేయటంతో పాటు, గతంలో ఆధునికీకరణ సమయంలో వదిలేసిన ప్రాంతాల్లో వెడల్పుతో పాటు ఎత్తు పెంచి డబుల్ రోడ్డు వేస్తేనే ఈ మార్గంలో ప్రయాణం సురక్షితం అవుతుంది.

ఎప్పుడో 1998లో రోడ్డేసి...

1998లో వచ్చిన వరదతో కరకట్టకు గండ్లు పడ్డాయి. దీంతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కరకట్ట ఎత్తు పెంచి, దానిపై తారుతో సిగిల్ రోడ్డు వేశారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు ఇదే రక్షణగా నిలిచింది. అయితే రోడ్డుపడ్డాక వాహనాల రద్దీ పెరిగింది. రూ.111 కోట్లతో 2010లో పనులు పూర్తి చేశారు. ప్రకాశం బ్యారేజి నుంచి పెనుమూడి వరకు కరకట్టను వెడల్పు చేసి, దానిపై డబుల్ రోడ్డు వేశారు. ఆ తర్వాత ఈ మార్గంలో రేపల్లె-విజయవాడ కరకట్ట బస్సు సర్వీసును కూడా ప్రారంభించారు. అయితే జగన్ ప్రభుత్వంలో కరకట్టపై ఇసుక రవాణాను అనుమతించారు. 40 నుంచి 50 టన్నులకుపైగా బరువుతో ఇసుక లారీలు విచ్చలవిడిగా తిరగడంతో రోడ్డు కుంగిపోయింది. నదివైపు అంచులు సగం వరకు కుంగి అత్యంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు పునర్ నిర్మాణం కోసం రూ.100 కోట్లతో నీటిపారుదల శాఖ పలు సార్లు ప్రతిపాదనలు పంపినా వైసీపీ ప్రభుత్వం వాటిని బుట్టదాఖలు చేసింది.

కొనుగోళ్లు కొంతే

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కళ్లాల్లోనే ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో వ్యవసాయశాఖ, మార్కెటింగ్‌శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణి.. మిల్లర్లు ఆడిందే ఆటగా పరిస్థితి నెలకొనడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మద్దత ధరకు ధాన్యం సేకరణ బాలారిష్టాల దశలో ఉండటంతో బహిరంగ మార్కెట్ కొనుగోళ్లను పట్టించుకునే వారే లేకుండా పోయారు. మొత్తం దిగుబడిలో ప్రభుత్వాలు సేకరించేది గరిష్ఠంగా 30 శాతానికే పరిమితం. మిగిలినదంతా కూడా బయట మిల్లుల్లోనో, దళారుల వద్దకు చేరేదే. అయితే లక్ష్యాల మేర కొనుగోళ్లపై పర్యవేక్షించాల్సిన అధికారులు వాటిని కూడా పట్టించుకోవడంలేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ మాత్రమే తమ పరిధిలోకి వస్తుందని, మిగతాదేదీ తమకు పట్టదన్నట్లు ఆయా విభాగాలు వ్యవహరిస్తున్నాయి. విభాగాల మధ్య సమన్వయం లేకపోగా ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటూ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో రైతులు అంతిమంగా నష్టపోవాల్సి వస్తోంది.

పర్యవేక్షణ పట్టదు..

మిల్లర్లు, దళారులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినా మద్దతు ధర ప్రామాణికం. అయితే మద్దతు ధరతో పనే లేదన్నట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితి ఉంది. ప్రభుత్వ కేంద్రాల ద్వారా మిల్లులకు తరలిన ధాన్యంపై ఏ అనే పేరుతో రిజిష్టర్ నిర్వహించాలి. ప్రైవేటుగా మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యానికి బీ అనే పేరుతో రిజిష్టర్ నిర్వహించాలి. ఏ రైతు నుంచి ఎంత ధరకు, ఎంత పరిమాణం కొనుగోలు చేశామనే సమగ్ర వివరాలు అందులో నమోదు చేయాలి. దీనిని డీఎస్‌వో సారథ్యంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ పర్యవేక్షించాలి. కానీ ఎక్కడా ఈ ప్రక్రియ కనిపించడంలేదు. ఏ గ్రామం పరిధిలో ఎంత పరిమాణం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లింది, ఎంతమేర బయటకు తరలివెళ్లింది అనే గణాంకాలను వీఏఏ కచ్చితంగా నమోదు చేయాలి. ఈ రికార్డూ లేదు. లక్షల టన్నుల ధాన్యం బయటి మార్కెట్‌కు తరలివెళుతుందని ఆయా విభాగాలకు తెలిసి కూడా, మామూళ్ల మత్తులో జోగుతూ తనిఖీలు మరిచారు. దళారులకు రైతులు అమ్ముకునే ధాన్యం వివరాలను వ్యవసాయశాఖ సహకారంతో రెవెన్యూ రెగ్యులేట్ చేయాలి. ధాన్యం సేకరణలో తమకు సంబంధం లేదన్నట్లు రెవెన్యూ విభాగం వ్యవహరిస్తోంది. దీంతో ధాన్యం కొనుగోలు విషయంలో దళారులు ఆడింది ఆట, పాడిందిపాటగా కనిపిస్తోంది. మిల్లర్లు చెప్పిందే ధరగా చెలామణి అవుతుండడంతో అన్నదాతలు ఈ విషయమై వ్యవసాయశాఖను వివరణ కోరితే ఇది సివిల్ సప్లయిస్ విభాగం పరిధిలోనిదని చెప్పడం గమనార్హం. వ్యవస్థలన్నీ నిద్రావస్థలో ఉండడంతో బయటి మార్కెట్‌లో మరీ తీసికట్టుగా ధాన్యాన్ని రూ.1100 నుంచి రూ.1300కు కూడా అడుగుతూ రైతులను నిలువునా ముంచేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌కు ఇప్పటికే తరలివెళ్లిన లక్షన్నర టన్నుల ధాన్య విషయంలో ఇదే జరిగింది.

మిల్లర్లకే వత్తాసు

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు కొనుగోలు విషయంలో కొర్రీలతో సరిపెడుతున్నారు. రైతుకు షెడ్యూల్ ఇచ్చిన తర్వాత ట్రక్ షీట్, జీఎల్‌టీ, ఎఫ్‌టీవో జారీతో ప్రక్రియ ముగిసినట్లే. ఈ దశలో ఎక్కడా కూడా రైతుకు నేరుగా మిల్లర్‌తో సంబంధమే ఉండకూడదు. షెడ్యూల్ ఇచ్చేటప్పుడు మాత్రం మిల్లు ఎంపిక మాత్రం రైతు ఇష్టాన్ని బట్టి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో మిల్లర్లు ధాన్యానికి కొర్రీలు పెడుతూనే ఉన్నారు. ఆర్ఎస్‌కే సిబ్బంది మిల్లర్లతో కలిసి మాయాజాలానికి తెరలేపడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఓసారి తేమ విషయంలో ఆర్ఎస్‌కేలో ఫైనలైజ్ అయిన తర్వాత మళ్లీ మిల్లు దగ్గర దాని విషయంలో కిరికిరి పెట్టడం వెనక మతలబు ఇదే. వాటిని పరిష్కరించాల్సిన ఆర్ఎస్‌కే టెక్నికల్ అసిస్టెంట్, మిల్లు కస్టోడియన్ అధికారులు మిల్లర్లకే వత్తాసు పలుకుతున్నారు.

జీజీహెచ్‌లో ఇకపై డిజిటల్ లావాదేవీలు

- సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో ఇకపై డిజిటల్ లావాదేవీలు సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మంగళవారం తెలిపారు. ఆసుపత్రిలో లభించి వివిధ సేవలకు యూజర్ చార్జీలు, చెల్లింపులు, డొనేషన్‌లు ఇక నుంచి డిజిటల్ రూపంలో జరుగుతాయన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీజీహెచ్‌లో స్పెషల్ రూములు, క్వార్టర్స్, జీజీహెచ్‌లో షాపులు, మెడికల్ బోర్డు ఫీజులు, నర్సింగ్ అప్రెంటిషష్స్, మెడికల్ సర్టిఫికెట్స్, వయసు ధృవీకరణ పత్రాలు తదితర లావాదేవీలు నిర్దేశించిన క్యూఆర్ కోడ్ ద్వారానే జరుగుతాయని, డిజిటల్ చెల్లింపులు చేసిన వారు తగు రశీదు చూపాలని ఆయన కోరారు.

వడ్డీ వ్యాపారి దాడిపై డీఎస్పీ విచారణ

ఒంగోలు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వడ్డీ డబ్బులు ఇవ్వలేదంటూ ఒంటరి మహిళను స్తంభానికి కట్టివేసి కొట్టిన కేసును ఒంగోలు మహిళ పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణకుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. స్థానిక నెహ్రూ కాలనీలో నివాసం ఉండే దార్ల మాధురి వడ్డీ డబ్బులు చెల్లించలేదని అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న సురేఖ ఈనెల 3న స్తంభానికి కట్టేసి విచక్షణ రహితంగా దాడి చేసింది. ఈమేరకు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్సీఎస్టీ చట్టం కింద ఎస్పీ విచారణ బాధ్యతలు డీఎస్పీ రమణకుమార్‌కు అప్పగించారు. ఈమేరకు ఆయన నెహ్రూకాలనీలోని సంఘటన స్థలాన్ని సందర్శించారు. బాధితురాలిని, సాక్షులను డీఎస్పీ విచారించారు.

ఘనంగా వరల్డ్ ఆరెంజ్ డే



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్య సమితి ప్రకటించిన వరల్డ్ ఆరెంజ్ డే వేడుకలు మంగళవారం ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఒంగోలు హౌసింగ్ బోర్డులోని సమితి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. బాలికలపై హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆరెంజ్ డే అనే నినాదాన్ని ఐక్యరాజ్య సమితి ఇచ్చిందని ఆమె తెలిపారు. ఆరెంజ్ రంగు శాంతికి చిహ్నమని, బాలికలపై జరిగే అత్యాచారాలు నిరోధించి శాంతియుతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆరెంజ్ రిబ్బన్లు ధరించి ప్రతిజ్ఞ చేశారు. స్త్రీలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు చైతన్యవంతం కావాలని మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ పేర్కొనగా, యువతులు అవకాశాలు అందిపుచ్చుకుని ధైర్యంగా ముందడుగు వేయాలని సమితి కోశాధికారి బీరం అరుణ అన్నారు. కార్యక్రమంలో శక్తిసదన్ సిబ్బంది సీహెచ్.కనకదుర్గ, గుంటూరు శ్రీదేవి, పి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చిన్నారులు

చీరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా పట్టణ పరిధిలోని రోటరీ కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తున్న యువజన వారోత్సవాలు మంగళవారం కూడా ఘనంగా జరిగాయి. రోటరీక్లబ్, ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో 5వ తరగతిలోపు చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. అలాగే చిన్నారులు కూడా పలు ఆధ్యాత్మిక, పోరాట యోధులు, తదితర అందమైన అలంకరణలతో అందరినీ అలరించారు.

మెరుగైన ఆర్థిక సమాజమే లక్ష్యం

చీరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండు రోజుల గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం మంగళవారం చీరాలలో నిర్వహించారు. పేదరిక నిర్మూలన, కలుషితం లేని వాతావరణం, తాగునీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

స్పెల్‌బీతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

సంతమాగులూరు డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో తడబాటు లేకుండా సమాధానం చెప్పుటయే స్పెల్‌బీ కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమని ఎంఈవో వి.కోటేశ్వరరావు, దినేష్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సంతమాగులూరులోని కాలనీ పాఠశాలలో మండల స్థాయి స్పెల్‌బీ కార్యక్రమం విద్యార్థులకు నిర్వహించారు. ఒక్కొక్క తరగతికి 1500 పదాలతో స్పెల్‌బీ పోటీ నిర్వహించారు. ఒక్కొక్క తరగతి నుంచి 12 టీంలు పాల్గొన్నాయి. మూడవ తరగతి 12, నాలుగవ తరగతి నుండి 12, ఐదవ తరగతి నుండి 12, మొత్తం 36టీంలు పాల్గొన్నాయి. ప్రాథమిక తరగతిలోనే విద్యార్థులకు వర్డ్ పవర్, స్పెల్లింగ్‌లు అభ్యసనం పెంపొందించడమే లక్ష్యం అని పేర్కొన్నారు.

డిజిటల్ సేవలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

చీరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ సేవలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎథికల్ హ్యాకర్ మల్లికార్జున్ రాహుల్ అన్నారు. మంగళవారం పట్టణంలో శ్రీగౌతమీ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎంవీ(వెంకటేశ్వర్లు) ఆధ్వర్యంలో ఓటీపీ, యూపీఐ, ఫిషింగ్ లింక్‌లు, ఫేక్ యాప్స్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వరప్రసాద్, డైరక్టర్ వడ్లమూడి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా హనుమంతరావు



హనుమంతరావు

పంగులూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కరిచేటి హనుమంతరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఖోఖో అసోసి యేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో ఈనెల 7వ తేదీన జరిగింది. ఈ ఎన్నికలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనంపాడు గ్రామానికి చెందిన కె.హనుమంతరావు రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు యం.సీతారామిరెడ్డి మంగళవారం తెలిపారు. ఇప్పటివరకు కె.హనుమంతరావు జిల్లా ఖోఖో అసోసియేషన్ కోశాధికారిగా పనిచేశారు. రాష్ట్ర అధ్యక్షులుగా కృష్ణా జిల్లాకు చెందిన ఎం.వీ.ఎస్.ఎస్.ప్రసాద్, కోశాధికారిగా సాధు శ్రీనివాసరావు (శ్రీకాకుళం) ఎన్నికయినట్లు తెలిపారు. ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఎంపికైన కరిచేటి హనుమంతరావుకు అసోషియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య అభినందనలు తెలిపారు.

మొక్కజొన్న రైతులను వెంటాడుతున్న కష్టాలు

- మొక్క దశలోనే పురుగు బెడద...నియంత్రించలేక అవస్థలు
- భారంగా మారుతున్న పెట్టుబడి ఖర్చు


మొక్కజొన్న పైరులో మచ్చల పురుగులను ఏరుతున్న కూలీలు

పర్చూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ పరిస్థితులు అనుకూలించక, గిట్టుబాటు ధరలు లేక కష్టాల్లో ఉన్న రైతులను అడుగడుగున సమస్యలు వెంటాడుతున్నాయి. మొంథా తుఫాను ప్రభావంతో రబీలో సాగు తలపెట్టిన మొక్కజొన్న సకాలంలో విత్తలేక పోయారు. గత్యంతరం లేక కాస్త ఆలస్యమైనా సాగుచేపట్టిన రైతులకు ప్రారంభ దశలోనే క్రిమి కీటకాల బెడద వెంటాడుతుంది. గతంలో మొక్కజొన్న సాగులో పంట చేతికి వచ్చే నాటికి రెండు నుంచి మూడుసార్లు క్రిమి సంహారక మందులు పిచికారి చేస్తే సరిపోయేది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సాగు ప్రారంభం మొక్క దశలోనే మూడు నుండి నాలుగు సార్లు మందులు చల్లాల్సి వస్తోందని దీంతో పెట్టుబడి బారం పెరిగిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు కొన్ని చోట్ల కత్తెర పురుగు కూడా కనిపిస్తుండడం రైతుల్లో ఆందోళన రేకెత్తిస్తుంది. ప్రస్తుతం అధికశాతం మచ్చల పురుగు(లద్దెపురుగు) పైర్లను కనిపిస్తుందని, దీన్ని నియంత్రించలేక నానా అవస్థలు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. కత్తెర పురుగు సోకితే ఏమిచేయాలో అర్థంకాక రైతులు ఒకింత కలవరానికి గురవుతున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఈఏడాది ఖరీఫ్ సాగు నామమాత్రంగానే సాగు అయ్యింది. అధిక శాతం రైతుల రబీ సాగువైపే ఆశలు పెట్టుకున్నారు. అయితే వాతావరణ పరిస్థితులతో పాటు గత ఏడాది వేల ఎకరాల్లో సాగుచేసుకున్న నల్లబర్లీ పొగాకు కొంత మేర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసినా అధిక భాగం రైతుల వద్దే నిల్వ ఉంది. దీంతో పాటు, గత మూడేళ్లగా సరైన ధరలేక శనగ కోల్డ్ స్టోరేజ్‌ల్లోనే నిల్వలు ఉన్నాయి. దీనికి తోడు రబీలో అధికశాతం రైతులు నల్లబర్లీ పొగాకును సాగుచేయాల్సి ఉన్నా, ఈ ఏడాది ప్రభుత్వం నల్లబర్లీ సాగును నిషేధించింది. దీంతో ఏపంటలు సాగుచేయాలో అర్థంకాక రైతుల్లో సందిగ్ధం నెలకొంది. అయితే వ్యవసాయ అధికారులు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని సూచనలు ఇచ్చిన నేపథ్యంతో పాటు మొక్కజొన్నకు కొంత మేర ప్రభుత్వ గిట్టుబాటు ధర వస్తుందన్న ఆశతో రైతులు సాగువైపు మొగ్గు చూపారు. గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు విస్తీర్ణంలో రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. ఇలాంటి తరుణంలో చీడ పీడలు, వాతావరణ పరిస్థితులు మొక్కజొన్న సాగుకు ఏ మేరకు అనుకూలిస్తాయో వేచిచూడాల్సి ఉంది.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

చినగంజాం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని పెదగంజాం, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు నన్నపనేని రవి, కుర్రా రామారావులు అన్నారు. మండలంలోని పెదగంజాం, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు దాతలు అందజేసిన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీజేశారు. మట్టిగుంట గ్రామానికి చెందిన బండారుపల్లి సింగర బాబు (టీటీడీ విజిలెన్ అధికారి), వారి మిత్రులు సీ.హెచ్.వెంకటేష్, నాగేశ్వరరావు, రోజారాణి, సీతామహాలక్ష్మిలు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థులకు పదివేలరూపాయిల విలువైన స్టడీ మెటీరియల్, రాతపుస్తకాలు, ఆల్‌ఇన్‌వన్‌ల పుస్తకాలను అందజేశారు. గత 8 సంవత్సరాల నుంచి విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు సహకారం అందిస్తున్నట్లు పెదగంజాం హెచ్‌ఎం తెలిపారు. కడవకుదురు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యులు కట్టెబోయిన సుబ్బారావు కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పదో తరగతి మోడల్ పేపర్లు అందజేశారు. దాతలు అందజేసిన మెటీరియల్స్‌ను హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెదగంజాం జడ్పీ పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ ఆసోది సుదర్శనరెడ్డి, పాఠశాల పూర్వ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు డీ.నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, రవికుమార్, పీడీ. అనీల్‌కుమార్, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధిని పెంపొందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న డీపీఎం రవి

పర్చూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో జీవనోపాధిని పెంపొందించి అభివృద్ధిని సాధించటమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని డీపీయం కె.రవి అన్నారు. మంగళవారం పర్చూరు వెలుగు కార్యాలయంలో మండల సమైఖ్య ఈసీ సభ్యులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, పరిశుభ్రత, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని రానున్న రోజుల్లో మహిళలో స్వయంశక్తితో అభివృద్ధి చెందాలన్న దృక్పదంతో నాలుగు రోజులపాటు శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్చూరు మండలాన్ని మోడల్ మండలంగా ఎంపిక చేసినట్లు వివరించారు. దీనిలో భాగంగా ఆదర్శ గ్రామాల మీద అవగాహన కల్పించడం, ఎలాంటి సదుపాయాలు కావాలనే విషయాలపై అవగాహన కల్పించడం శిక్షణా తరగతుల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈకార్యక్రమంలో ఎపీఎం కె.రామకృష్ణ, డీఎంజీ ఓ.శ్రీనివాసరావు, సీసీలు విజయకుమార్, శ్రీనివాసమూర్తి, నరసింహారావు, గ్రామ సంఘాల ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో 124 మంది ఎంపిక



నియామక పత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

అద్దంకి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో మంగళవారం పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్ మేళాలో 124 మంది ఎంపికయ్యారు. మొత్తం 321 మంది హాజరుకాగా 11 కంపెనీలలో పనిచేసేందుకు 124 మందిని ఎంపిక చేశారు. మరో 62 మందిని షార్ట్ లిస్ట్ చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరమ్మ మాట్లాడుతూ జాబ్‌మేళాల నిర్వహణతో గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగ యువకులు ఆయా కంపెనీలకు సులభంగా ఎంపికయ్యేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాజారావు, స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, రంగిశెట్టి సాంబశివరావు(లహరి), జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ వంతెనకు తాత్కాలిక మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న కార్మికులు

అద్దంకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణ సమీపంలో గుండ్లకమ్మ నదిపై ఉన్న వంతెనకు తాత్కాలిక మరమ్మతులు ప్రారంభించారు. 4 దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిధిలావస్థకు చేరి తరచూ మరమ్మతులకు గురవుతోంది. వంతెన శ్లాబుపై గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇటీవల తుఫాన్‌కు గోతులు మరింత పెరిగాయి. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.2 లక్షల వ్యయంతో తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులతో కొంత ఉపశమనం కలిగినా కొద్దిపాటి వర్షం కురిసినా మరోసారి గోతులు ఏర్పడే అవకాశం ఉందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. కనీసం వంతెన మొత్తం ఒక లేయర్ నిర్మాణం చేస్తే కొంతమేర ప్రయోజనం ఉంటుందని వాహనచోదకులు అభిప్రాయపడుతున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో మెరుగైన సమాజం

వేటపాలెం (చీరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఓత్సాహిక పారిశ్రామిక వేత్తలతో మెరుగైన సమాజం రూపొందుతుందని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఎంటర్ పెన్యువర్‌షిప్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పారిశ్రామిక వేత్తలుగా రాణించేందుకు కావాల్సిన లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్‌బాబు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే కోటి సంతకాల : కరణం

రామకృష్ణాపురం (చీరాల), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజల సహకారంతోనే చీరాల్లో కోటి సంతకాల ఉద్యమం పూర్తి చేసినట్లు వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పేర్కొన్నారు. వైద్యవిధానంపై రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ తలపెట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 61,458 సంతకాలు పూర్తి చేశారు. ఈసందర్భంగా మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు నిరంతరం వెన్నంటి ఉండేది వైసీపీనేనని చెప్పారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రక్షణ కల్పించాలి

- సీపీఎం కేంద్రకమిటీ సభ్యురాలు రమాదేవి

పంగులూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో 80 శాతంగా ఉన్న కౌలు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన రక్షణ కల్పించాలని సీపీఎం కేంద్రకమిటి సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో మంగళవారం రాత్రి కౌలు రైతులతో రమాదేవి సమావేశం నిర్వహించారు. ఆరుగాలం శ్రమించి పంటసాగు చేసే కౌలు రైతులకు రక్షణ కరువైందన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా విధానాలు మారకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రత్యక్షంగా భూమిమీద ఉండి వ్యవసాయం చేసే కౌలు రైతులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతూ సంక్షోభంలోకి నెట్టబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లభించక పోవడంతో సాగులోలేని భూయజమానులే ప్రభుత్వ పథకాల ఫలాలు పొందుతున్నారన్నారు. గుర్తింపు కార్డులు లేక కౌలు రైతులు పంటలను ఈ క్రాప్‌చేసే పరిస్థితి లేదన్నారు. కౌలు రైతులు సంఘటితమై తమ హక్కుల సాధనం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.గంగయ్య, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీఐటీయూ నాయకులు గుడిపాటి మల్లారెడ్డి, రైతుసంఘం నాయకులు నాయపాము ప్రభాకర్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల నూతన కమిటీ

అద్దంకి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మండల ఆర్‌ఎంపీ, పీఎంపీల నూతన కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక రేణింగవరం రోడ్డులోని అహ్మద్ క్లినిక్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ లింగారావు, కార్యదర్శిగా కరీం, కోశాధికారిగా సైదావలి, ఉపకార్యదర్శిగా కల్యాణ చక్రవర్తి, ఉపాధ్యక్షుడిగా నరేష్‌లను ఎన్నుకున్నారు. వి.సుబ్బారావు, ఖాజావలి, చంద్రశేఖర్లు అబ్జర్వర్లుగా వ్యవహరించారు. మండలంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు నూతన కమిటీ తెలియజేసింది.

ఇసుక టిప్పర్ పట్టివేత

కొత్తపేట (చీరాల), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా సాగిస్తున్న టిప్పర్‌ను టూటౌన్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారి నుండి చీరాల వైపునకు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అవీ..ఇవీ..

రోడ్డు అంచులో చిల్లచెట్ల తొలగింపు


చిల్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బల్లికురవ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నుపల్లి అనంతవరం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రజలకు ఇబ్బందిగా ఉన్న తుమ్మ చెట్లను రెండు రోజుల నుంచి తొలగిస్తున్నారు. ఈ రోడ్డులో ఉన్న మల్లాయపాలెం వేమవరం గ్రామాల మధ్య రోడ్డు అంచులో పెద్దఎత్తున తుమ్మ చెట్లు రోడ్డుపైకి ఎగబాకాయి. దీంతో వాహన చోదకులు ప్రతి రోజు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రెండు వాహనాలు ఎదురు పడితే తుమ్మ చెట్లు వాహనా లను తాకుతున్నాయి. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య వెళ్లటంతో రోడ్డు అంచుల్లోని తుమ్మ చెట్లను తొలగించేందుకు సంబంధిత కాంట్రాక్టరకు పనులను కేటాయించారు. సుమారు 10 కిలోమీటర్ల మేర రెండు గ్రామాల మధ్య ఉన్న రోడ్డులో తుమ్మ చెట్లను యంత్రంతో తొలగించే పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి అయితే వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు అని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయుడు రవికుమార్‌కు అభినందన


పిల్లలకు ఫ్యాన్, మ్యాట్‌ను అందజేస్తున్న ఎంఈవోలు

బల్లికురవ, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తాను పనిచేస్తున్న పాఠశాలలో విద్యార్థులకు తనవంతు సహకారం అందించిన ఉపాధ్యాయుడు గుంటుపల్లి రవికుమార్‌ను ఎంఈవోలు శ్రీనివాసరావు, రమేష్‌బాబులు అభినందించారు. మండలంలోని కూకట్లపల్లి ప్రాథమిక పాఠశాల(హెచ్‌సీ)లో విద్యార్థుల మధ్యాహ్న భోజన తయారీకి అవసరమైన గ్యాస్ పొయ్యిని వంట తయారు చేసే నిర్వాహకురాలికి రూ.5 వేల నగదును, అంగన్ వాడీ విద్యార్థులకు ఫ్యాన్, వారు నేలపై కుర్చోకుండా మ్యాట్‌ను అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గుంటుపల్లి రవికుమార్ అందజేశారు. ఉపాధ్యాయుడు అందజేసిన వస్తువులను ఎంఈవోలు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పందిరి అబ్రహం, ప్రదానోపాధ్యాయులు, తిరుపాలు పాల్గొన్నారు.

వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) :కావలి వన్‌టౌన్ సీఐగా పనిచేస్తున్న ఎం డి ఫిరోజ్ జన్మదినం సందర్భంగా మంగళవారం పట్టణంలోని వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం,దుప్పట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం మస్తాన్‌వలి, హోంగార్డు నాగూర్, కాశింబుడే, కలాం తదితరులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును సాగుచేయవద్దు

యద్దనపూడి,(మార్టూరు)డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): రైతులు నల్లబర్లీ పొగాకును సాగుచేయవద్దని, ఒక వేళ నిబంధనలకు విరుద్ధంగా రైతులు సాగుచేస్తే మండల టాస్క్‌ఫోర్సు టీం వారు వచ్చి మొక్కలను తొలగిస్తారని ఏవో కుమారి హెచ్చరించారు. యద్దనపూడి మండలంలోని చిమటా వారిపాలెం, వింజనంపాడు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె రైతులతో మాట్లాడుతూ పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగ, మొక్కజొన్న, జొన్న, కుసుమ పంటలను సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ జిలాని, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆహార పంటల సాగుపై మొగ్గు చూపండి

ఇంకొల్లు, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి) : ఆహారపంటలైన పెసర, మినుము, కంది తదితర ఆహార పంటల సాగుపై రైతులు మొగ్గు చూపాలపి మండల వ్యవసాయాధికారి మేరమ్మ సూచించారు. మండలంలోని సూదివారిపాలెంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఆహార పంటపై దృష్టి సారించాలన్నారు. పొగాకు పంటసాగు చేయవద్దన్నారు. వరి పంట అనంతరం పంటను అమ్ముకునేందుకు ఆర్‌బీకే కేంద్రాల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే 24 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతాయన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతుసంక్షేమం కోసం వ్యవసాయ యంత్రపరికరాలపై అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధులకు వీల్ చైర్లు, చేతికర్రల పంపిణీ


వృద్ధులకు వీల్‌చైర్స్, చేతికర్రలను ఇస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో బృందావనం నాగులపాలెంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వీల్ చైర్లు, చేతికర్రలు, గొడుగులను రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, నాగభైరు శ్రీనివాసరావుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. వీటికి కావలసిన ఆర్థిక సహకారాన్ని వెలగా శ్రీరాం ప్రసాద్ కుమార్తె చార్వాణి అందజేసి దాతృత్వం చాటుకున్నారు.అనంతరం వృద్ధులకు బోజన ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, రోటరీ ప్రతినిధులు కెఎస్‌ఆర్‌కె. ప్రసాద్, పాబోలు ఉదయ భాస్కర్, నాగుబడి సుబ్బారావు, కోటా శ్రీనివాసరావు, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, భవనం రాజగోపాల రెడ్డి, ఆశ్రమ నిర్వహకులు భవనం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి అదృశ్యంపై కేసునమోదు

కారంచేడు(పర్చూరు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాలిక అదృశ్యంపై కారంచేడు పోలీసు స్టేషన్‌లో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కారంచేడు గ్రామ పంచాయితీ స్వీపర్‌గా పనిచేస్తున్న చేవుటూరి వెంకటేశ్వర్లకు చెందిన సుమారు 7 సంవత్సరాల వయస్సు కల్గిన పెంపుడు కుమార్తె ఈ నెల 7న అదృశ్యమైంది. గ్రామంలోని తెలిసిన వారిని విచారించినా అచూకీ లభ్యం కాలేదు. దీంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెంపుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్.ఖాదర్ బాషా తెలిపారు.

జూదరులు అరెస్ట్

చినగంజాం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం శివారులోని జూద స్థావరంపై చినగంజాం పోలీసులు మంగళవారం దాడి చేశారు. గ్రామ శివారులోని తోటల్లో జూదం ఆడుతున్న ఐదుగురిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్.ఐ శీలం రమేష్ తెలిపారు. వారి నుంచి రూ.4,200ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి బుధవారం న్యాయస్థానంలో హాజరు పరుస్తామన్నారు.

శనగలో బెట్ట నివారణ చర్యలు తీసుకోవాలి


రైతులతో కలసి శనగ పైరును పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శనగసాగు చేసిన రైతులు బెట్ట నివారణ చర్యలు తీసుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో సాగు చేస్తున్న పలు పంటలను అయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ శనగ పంటలో 30 నుంచి 40 రోజుల మధ్య అవకాశం ఉన్న రైతులు స్ప్రింకర్లతో తడి అందించాలన్నారు. మల్టీకె(పోటాషియం నైట్రేట్) ఒక కేజీ, నానో యూరియా 500 ఎంఎల్ ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాగులపాడు సొసైటి అధ్యక్షుడు ఏనుగంటి వెంకట రామయ్య, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ దినేష్‌సాయి, షేక్ మహబూబ్ సుభాని, ఆత్మ బ్లాక్ టెక్నికల్ మేనేజర్ శేషారావు, రైతులు పాల్గొన్నారు.

పంటసాగులో ఆధునిక పద్ధతులు పాటించండి

పంగులూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంటసాగులో రైతులు ఆధునిక పద్ధతులను పాటించాలని ఏవో డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం, ముప్పవరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 740 జీవో ద్వారా నల్లబర్లీ పొగాకు సాగు నిషేదించిందని, రైతులెవరూ నల్లబర్లీసాగు చేపట్టవద్దన్నారు. నల్లబర్లీ పొగాకు సాగుచేస్తే పంటను తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు గోపీకిరణ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

220 మందికి ఉచిత వైద్య పరీక్షలు


కంటిని పరీక్షిస్తున్న వైద్యులు

చినగంజాం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాలెం గ్రామంలోని రైతుసేవా కేంద్రం ఆవరణలో ఒంగోలు కిమ్స్ వైద్యశాల వారు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పల్లెపాలెం గ్రామ సర్పంచ్ సైకం మణి, గ్రామ కార్యదర్శి రాజా మోహన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. హాస్పిటల్ వైద్యలు డాక్టర్ రామాంజనేయులు పలు రకాల వ్యాధులకు సంబంధించి, ఆప్తమాట్రిక్స్ స్వాతి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రోగనిర్ధారణ జరిగిన 42 మందిని ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్లు తెలిపారు. హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్‌ఎస్, ఈసీహెచ్‌ఎస్, రైల్వే, ఎఫ్‌సీఐ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన స్వాములు


శబరిమలకు బయలుదేరిన స్వాములు

మార్టూరు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): పట్టణం నుంచి మంగళవారం 20 మంది అయ్యప్ప దీక్షదారులు శబరిమలకు బయలుదేరి వెళ్లారు. పడమర బజారు, బలరాం కాలనీ, నేతాజీనగర్ల నుంచి స్వాములు ప్రత్యేకమైన బస్సులో బయలుదేరివెళ్లారు. గత వారం రోజుల వ్యవధి లో మార్టూరు నుండి భవాని,శివ, అ య్యప్ప స్వాములు వంద మంది దాకా దీక్ష ను ముగించారు.

గాయపడిన వ్యక్తికి టీడీపీ సాయం అందజేత

మార్టూరు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టణంలో గొట్టిపాటి నగర్‌కు చెందిన షేక్ బాజి కత్తిపోట్లుకు గురై గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న షేక్ బాజిని టీడీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబానికి పార్టీతరపున రూ.50 వేల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో షేక్ రజాక్, తొండెపు ఆదినారాయణ, సెల్ సుభాని, ముల్లా మస్తాన్ వలి, షేక్ రహీమా, షేక్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

మార్టూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల పంచాయతీ కార్మికులకు మంగళవారం రోటరీ మాజీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటేరియన్లు మాదాల సాంబశి వరావు, చెన్నుపాటి బసవరాములు జాష్టి సాంబశివరావు, పెంట్యాల శ్రీను, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.


అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు : సీఐ

పంగులూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అద్దంకి ఎక్సైజ్ సీఐ ఏ.భవాని హెచ్చరించారు. మండలంలోని కోటపాడు గ్రామంలో సోమవారం రాత్రి సీపీఎం కేంద్రకమిటి సభ్యులు డి.రమాదేవి నేతృత్వంలో స్థానిక మహిళలు అక్రమ మద్యం విక్రయ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్ఐ. హర్షవర్థన్‌రెడ్డి స్థానిక వీఆర్‌వో మహిళా పోలీస్, గ్రామపెద్దలతో ఆయా దుకాణాల్లో మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మకాలు నిర్వహిస్తున్న సమాచారం కంట్రోలురూం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నెంబరు 9440902497కు తెలియజేయాలన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

మేదరమెట్ల డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో మేదరమెట్ల తిమ్మనపాలెంలో కారు డివైడర్‌ను ఢీకొనడంతో బోల్తాపడింది. మంగళవారం వేకువ జామున అరుణాచలం నుంచి విజయవాడ వెళుతున్న కారు డ్రైవర్ నిద్రమత్తులోనికి జారుకోవడంతో డివైడర్‌ను ఢీకొని బొల్తాపడింది. కారులో ముగ్గురు మహిళలు, డ్రైవర్ ఉన్నారు. కారులో ఉన్నవారికి స్వల్ప గాయాలు మాత్రమే అయ్యాయి. గాయపడిన వారికి 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. హైవే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి గాయపడిన వారికి వైద్యశాలకు పంపించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

అద్దంకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అ ప్రమత్తంగా ఉండాలని శక్తిబృందం ఎస్సై శ్రీహరిబాబు అన్నారు. అద్దంకి పట్టణంలోని విద్యానగర్‌లో హోలీఫెయిత్ హైస్కూల్‌లో చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో మంగళవారం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపద సమయంలో శక్తి యాప్ వినియోగం, 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్', ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై నరశింహరావు, కే.సుబ్బారావు, శక్తి టీం సభ్యులు, హెచ్‌ఎం హెబ్సిబా అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.